FLASH INDIA NEWS
ప్రతిక్షణం... ప్రజలకోసం...
www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
FLASH INDIA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2010/33229

**విలేకరులు కావలెను**
17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9951494039

| సంపుటి : 17 | సంచిక :77 | బుధవారం 22.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/- |
|---|---|---|---|---|---|

## మేము ఎప్పుడూ చెప్పలేదు

- ఒకేసారి "బంగారు తెలంగాణ" చేయడం సాధ్యం కాదు
- నల్గొండలో ₹4,000 కోట్ల బకాయిలు
- గత ప్రభుత్వం 10 ఏళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలే
- ధాన్యం నిల్వల్లో ₹11,000 కోట్ల స్కామ్
- కాంగ్రెస్ వచ్చిన తర్వాత కొంత ధాన్యం రికవరీ
- లారీలు పెంచి రాత్రి-పగలు కొనుగోలు
- ఎక్కువ ధాన్యం వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు
- రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూల్స్/హాళ్ల వద్ద కేంద్రాలు
- నల్గొండ జిల్లాలో 2.30 లక్షల టన్నుల ధాన్యం వచ్చే అవకాశం

05



## తెలంగాణ సీఎం మహిళలకు అన్యాయం చేసిండు..

### కేసీఆర్, రేవంత్రెడ్డిపై కేంద్రమంత్రి బండి ఫైర్

- కాళేశ్వరం స్కామ్లో కేసీఆర్ను కాపాడుతోంది రేవంత్ రెడ్డేనని వెల్లడి
- రూ.9 వేల కోట్లపైనే విచారణ జరపాలని సీబీఐకి లేఖ రాశారు
- లక్ష కోట్ల అవినీతిపై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీత

05



## కేసీఆర్ జగిత్యాల సభపై కవిత సెటైర్లు

### జగిత్యాల సభలో అన్నీ పిట్టకథలే

- తండ్రి ప్రసంగంపై కవిత గరం గరం
- జాతీయ అంశాలు ఎందుకు ప్రస్తావించలేదని నిలదీత
- తెలంగాణ వ్యతిరేకి జీవన్రెడ్డి అంటూ మండిపాటు

05



# ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్..

## పనిచేసిన కాలం, రిటైర్మెంట్ ఆధారంగా...

- తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు కొత్త మార్గదర్శకాలు విడుదల
- మే 1నుంచి మే 31 వరకు బదిలీలకు అవకాశం
- 01-01-2026 నాటికి ఒకే స్థానంలో కనీసం 3 సంవత్సరాలు పూర్తి చేసిన వారు బదిలీకి అర్హులు
- భార్య/భర్త కారణాలతో బదిలీ కోరే వారికి 3 సంవత్సరాల షరతు నుంచి మినహాయింపు
- 31-12-2025 నాటికి ఒకే చోట 4 సంవత్సరాలు పూర్తి చేసినవారిని తప్పనిసరిగా బదిలీ
- 4 సంవత్సరాలకు పైగా కొనసాగించరాదని స్పష్టం
- 31-05-2027 లోపు రిటైర్మెంట్ ఉన్న ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ..

02

### తెలంగాణ ఉద్యోగుల బదిలీలకు కొత్త మార్గదర్శకాలు..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనలు పనిచేసిన కాలం, వ్యక్తిగత పరిస్థితులు, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. మే 1నుంచి మే 31 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించనున్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం 01-01-2026 నాటికి ఓ నిర్దిష్ట స్థానంలో కనీసం మూడు సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. అయితే జీవిత భాగస్వామి కారణాలతో బదిలీ కోరే ఉద్యోగులకు ఈ మూడు సంవత్సరాల షరతు వర్తించదు. వారికి ప్రత్యేక సడలింపు ఇవ్వబడింది.అదేవిధంగా 31-12-2025 నాటికి ఒకే స్థానంలో నాలుగు సంవత్సరాల సేవ పూర్తి చేసిన ఉద్యోగులను అక్కడ కొనసాగించరాదు. అంటే నాలుగు సంవత్సరాలకుపైగా ఒకే చోట పనిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అయితే, రిటైర్మెంట్కు సమీపంలో ఉన్న ఉద్యోగులకు కొంత ఉపశమనం కల్పించారు.

## కాంగ్రెస్ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు..

### 'ఉగ్రవాది' అని.. ఆపై వివరణ!

- కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు
- చెన్నైలో సమావేశంలో మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు
- దక్షిణాది రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపణ
- అన్నాడీఎంకే–బీజేపీ పొత్తుపై ప్రశ్నలు
- ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని విమర్శ
- పెరియార్, అంబేడ్కర్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ
- "ఉగ్రవాది" అన్నానని ఖండన
- "ప్రజలను భయపెడుతున్నారు" అన్నానని స్పష్టం
- ఐటీ, ఈడీ సంస్థలను ఉపయోగించి బెదిరిస్తున్నారని ఆరోపణ

02



కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా చెన్నైలో జరిగిన ఒక విలేకరుల సమావేశంలో ఆయన ప్రధాని మోదీని 'ఉగ్రవాది'తో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సమానత్వ సిద్ధాంతాలను నమ్మని ప్రధాని, దక్షిణాది రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## రహస్యమేమీ లేదు..

రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
సీఎంఓ నుంచి మీడియాకు లీకులు ఇస్తున్నారని ఆరోపణ
ఖరీదైన లాయర్లను వ్యక్తిగత రక్షణ కోసం నియమించుకున్నారని వ్యాఖ్య
హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు
'ఓటుకు నోటు' కేసు, ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఘాటు వ్యాఖ్యలు
కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని వ్యాఖ్య

03




## నకిలీ కరెన్సీ పై నజర్..!

### చిరు వ్యాపారులే లక్ష్యం..!

- నర్సంపేటలో నకిలీ నోట్ల చలామణి కలకలం
- స్థానిక యువకులు ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు అనుమానం
- ముగ్గురు యువకులను విచారణ కోసం వరంగల్కు తరలింపు
- నకిలీ నోట్లతో పాటు గంజాయి వినియోగం కూడా పెరుగుతోందని చర్చ
- ముఖ్యంగా ₹500, ₹200 నకిలీ నోట్లు ఎక్కువగా చలామణి
- ఏపీ నుంచి సరఫరా అవుతున్నట్లు సమాచారం

02

నకిలీ నోట్లను చెలామణిలోకి తెస్తున్న యువకులు చిరు వ్యాపారులను, బెల్ట్ షాపు నిర్వాహకులను, కూరగాయలు, పండ్ల వ్యాపారులను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నోట్లను పరిశీలించే అవకాశం చిన్న వ్యాపారులకు తక్కువగా ఉండటం, వీరిలో మెజారిటీ జనాలు నిరక్షరాస్యులు ఉండటంతో...

## రెంటల్ హబ్‌గా.. భాగ్యనగరం!

### గ్రేటర్లో అద్దె ఇళ్లదే రాజ్యం



- స్వగృహం ఉన్న వారి శాతం 23.08 మాత్రమే
- హైదరాబాద్లోని 77 శాతం మంది రెంట్ హౌస్లలోనే..
- గ్రామీణ ప్రాంతాల్లో ఏకంగా 68 శాతం మంది సొంత ఇల్లు
- ఇల్లు కొనాలంటే ఆస్తుల అమ్మాల్సిన స్థితి
- ఇక ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల భయం
- దీంతో అద్దె ఇంటికే ప్రాధాన్యత ఇస్తున్న జనం

02

హైదరాబాద్ అంటేనే కలల నగరం. వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు వెతుక్కుంటూ రాష్ట్రం నలు మూలల నుంచి జనం ఇక్కడికి వస్తుంటారు. అయితే, భాగ్యనగరంలో నివసిస్తున్న వారికి సంబంధించి ఇప్పుడు ఒక ఆందోళన కలిగించే విషయం బయటపడింది. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే 2024 ప్రకారం.. హైదరాబాద్లో సొంత ఇల్లు ఉన్నవారి సంఖ్య రాష్ట్రంలోనే అతి తక్కువగా ఉందట!

## చంద్రబాబుకు పొన్నం బహిరంగ లేఖ

### తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు అడ్డుకోండి..

- రాష్ట్ర విభజన చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా జరిగిందని స్పష్టం
- తెలంగాణ ఏర్పాటుపై అనవసర ద్వేషాలు రగల్చొద్దని విజ్ఞప్తి
- తెలంగాణ ప్రజల భావాలను గౌరవించాలని సూచన
- తేజస్వి సూర్య వ్యాఖ్యలు తెలంగాణపై విషం చిమ్మినట్లుగా ఉన్నాయ్
- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు కూడా అభ్యంతరకరమని పేర్కొన్నారు
- ప్రధాని వ్యాఖ్యలే ఈ వివాదాలకు కారణమని ఆరోపణ
- రాష్ట్ర విభజనపై ఆయన వ్యాఖ్యలు అనుచితమని విమర్శ

05



**ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీ** 02

# ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనే

## ఈసీకి 700 మంది కంప్లయింట్..!

**ఢిల్లీ :** పార్లమెంట్ లో మహిళా కోటా బిల్లు వీగిపోయిన తర్వాత ప్రధాని మోదీ జాతినుద్దేశించిన చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. ప్రధాని ప్రసంగం ఎన్నికల నియమావళిని ఉల్లఘించడమే అని 700 మంది కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు లో ఉండగా.. అధికారిక మీడియాలో ప్రధాని మోదీ ప్రసంగించడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది.. చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ 700 మందికి పైగా పౌరులు ఈసీకి లెటర్ రాశారు. ఏప్రిల్ 23న తమిళనాడు,పశ్చిమ బెంగాల్ లలో ఎన్నికలు జరగనున్నాయి.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు అమలులో ఉండగాదూరదర్శన్, సంసద్ టీవీ, ఆల్ ఇండియా రేడియో వంటి అధికారిక మీడియాలో మోదీ ప్రసంగం చేయడం ఎన్రికల ప్రచారం కిందకే వస్తుందని తమ ఫిర్యాదులో ఈసీకి తెలిపారు. మొత్తం 700 మంది సంతకాలు చేసిన లెటర్ ను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించారు. ఏప్రిల్ 9న అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో మొదటి విడత ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 23 న పశ్చిమబెంగాల్ , తమిళనాడులలో మరో విడత పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు ఉంది.. అయినప్పటికీ ఏప్రిల్ 18న ప్రధాని మోదీ అధికారిక మీడియాలో జాతినుద్దేశించి ప్రసంగించడం కోడ్ ఉల్లంఘనకిందికే వస్తుందని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నడిచే ఇటువంటి కార్యక్రమాల ద్వారా అధికార పార్టీకి ప్రయోజనం కల్పిస్తోందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు అవసరమైన అవకాశాలను దెబ్బతీస్తోందని ఫిర్యాదు చేశారు.ఎం సీసీ నిబంధనలను గుర్తు చేస్తూ.. మంత్రులు తమ అధికారిక విధులను ఎన్నికల ప్రచారంతో లింకు చేయడం, వారి ప్రయోజనాలకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగించడం వంటివి చేయరాదని ఫిర్యాదుదారులు తెలిపారు.ఈ విషయాన్ని ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని, ప్రసంగంలోని విషయాలను, తీరును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రసారానికి ముందస్తు అనుమతి మంజూరు చేసి ఉంటే, ఇతర రాజకీయ పార్టీలకు కూడా ప్రభుత్వ ప్రసార మాధ్యమాల్లో సమాన ప్రసార సమయం కేటాయించాలని 700మంది సంతకాలు చేసిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదుచేసిన వారిలో ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, రాజకీయ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్, కార్యకర్త యోగేంద్ర యాదవ్, ఆర్థికవేత్త జయతి ఘోష్, సంగీత-రచయిత టీఎం కృష్ణ, యూనియన్ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ, కార్యకర్త హర్ష్ మందర్, జర్నలిస్టు పరంజోయ్ గుహ ఠాకుర్తా, విద్యావేత్త మదుమంబద్‌స్సాద్ ,మాజీ విద్యావేత్త జోయా హసన్ ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటానికి కమిషన్ త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.

# ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనలు పనిచేసిన కాలం, వ్యక్తిగత పరిస్థితులు, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. మే 1నుంచి మే 31 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించనున్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం 01-01-2026 నాటికి ఓ నిర్దిష్ట స్థానంలో కనీసం మూడు సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులు బదిలీలకు అర్హులు. అయితే జీవిత భాగస్వామి కారణాలతో బదిలీ కోరే ఉద్యోగులకు ఈ మూడు సంవత్సరాల షరతు వర్తించదు. వారికి ప్రత్యేక సడలింపు ఇవ్వబడింది.అదేవిధంగా 31-12-2025 నాటికి ఒకే స్థానంలో నాలుగు సంవత్సరాల సేవ పూర్తి చేసిన ఉద్యోగులను అక్కడ కొనసాగించరాదు. అంటే నాలుగు సంవత్సరాలకుపైగా ఒకే చోట పనిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అయితే, రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న ఉద్యోగులకు కొంత ఉపశమనం కల్పించారు. 31-05-2027 లోపు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులు నాలుగు సంవత్సరాల సేవ పూర్తి చేసినప్పటికీ, వారు స్వయంగా బదిలీ కోరితే తప్ప వారిని బదిలీ చేయరాదు.ఇక పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉండేందుకు ఒకే కేడర్‌లో 40% కంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలతో బదిలీ ప్రక్రియను సవ-ంతుల్యంగా నిర్వహించాలనే ఉద్దేశం ప్రభుత్వం వెల్లడించింది. ఈ మార్గదర్శకాలతో ఉద్యోగుల బదిలీలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగే అవకాశం ఉండనుంది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే అంశంలో కొంత జాప్యం జరిగి ఉండవచ్చని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించడానికి నలుగురు అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి కార్మికుల సమస్యలు విన్నవిస్తే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.ఉద్యోగులుగా మీరు.. ప్రభుత్వంగా తాము కలిసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం ప్రయాణికుల సౌలభ్యం చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఎలాంటి భేషజాలకు పోకుండా అధికారుల కమిటీకి ఉద్యోగుల సమస్యలు విన్నవించాలని సూచించారు. ఆయా



సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు..**

మరోవైపు.. టీజీఎస్ ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓఎంఎస్ నంబర్ 66ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఉద్యోగుల నుంచి, వారి సేవా నిబంధనలు, సంబంధిత విషయాలపై పలు సమస్యలను లేవనెత్తుతూ ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. ఈ వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, తగిన సిఫార్సులను సూచించడానికి ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేస్తోంది.ఈ కమిటీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రహదారులు, భవనాల శాఖ చైర్మన్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ - సభ్యుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ - సభ్యుడు, వైస్ చైర్మన్ ఽ మేనేజింగ్ డైరెక్టర్, టీజీఎస్ఆర్టీసీ - సభ్యుడు ఽ కన్వీనర్ ఈ కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, ఈ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి నాలుగు వారాల వ్యవధిలోగా నివేదికను సమర్పించాలని ప్రభుత్వం సూచించింది.

# రెంటల్ హబ్‌గా..భాగ్యనగరం!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ అంటేనే కలల నగరం. వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు వెతుక్కుంటూ రాష్ట్రం నలు మూలల నుంచి జనం ఇక్కడికి వస్తుంటారు. అయితే, భాగ్యనగరంలో నివసిస్తున్న వారికి సంబంధించి ఇప్పుడు ఒక ఆందోళన కలిగించే విషయం బయటపడింది. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే 2024 ప్రకారం.. హైదరాబాద్లో సొంత ఇల్లు ఉన్నవారి సంఖ్య రాష్ట్రంలోనే అతి తక్కువగా ఉందట!

**గ్రామీణ ప్రాంతాల్లో భిన్నంగా..**

గ్రామీణ ప్రాంతాల్లోనే సొంత ఇళ్లు ఎక్కువ నగరానికి,పల్లెటూరికి మధ్య ఉన్న అసలు తేడాను ఈ సర్వే కళ్లకు కట్టినట్లు చూపించింది. నగరాల్లో అద్దె ఇళ్లు ఎక్కువైతే, పల్లెల్లో మాత్రం సొంత ఇళ్లకే ప్రాధాన్యం ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా నారాయణపేట్ జిల్లాలో 68.88 శాతం మందికి సొంత ఇల్లు ఉంది. ఆ తర్వాత వనపర్తి (67.02%), జోగులాంబ గద్వాల (65.21%) జిల్లాలు వరుస స్థానాల్లో నిలిచాయి. ఇక్కడ అద్దెకు ఉండేవారి శాతం చాలా తక్కువ. ఉదాహరణకు నారాయణపేట్ లో కేవలం 26.17 శాతం మంది మాత్రమే అద్దె ఇళ్లలో ఉంటున్నారు. ఎందుకీ అంతరం? హైదరాబాద్లో సొంత ఇల్లు కొనడం అనేది సామాన్యుడికి ఇప్పుడు తలకు మించిన భారంగా మారింది. రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్ని తాకడం, ఐటీ రంగం విస్తరణతో భూముల రేట్లు పెరగడం వల్ల చాలామంది ఇల్లు కొనే బదులు అద్దెకు ఉండటమే బెటర్ అని భావిస్తున్నారు. మరోవైపు, ఉద్యోగ రీత్యా బదిలీలు ఉండటం, ఐదేళ్ల తర్వాత ఇక్కడ ఉంటామో లేదో అన్న అనిశ్చితి వల్ల కూడా ఐటీ ఉద్యోగులు అద్దె ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో వంశపారంపర్యంగా వచ్చే ఇళ్లు ఉండటం, స్థలం తక్కువ ధరకే దొరకడం వంటి కారణాల వల్ల అక్కడ ఓనర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

**అద్దె ఇళ్లదే రాజ్యం**

ఈ సర్వే వెల్లడించిన గణాంకాలు చూస్తుంటే, హైదరాబాద్లో మెజారిటీ జనాభా అద్దె ఇళ్లలోనే తలదాచుకుంటున్నట్లు స్పష్ట మవుతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 23.08 శాతం మందికి మాత్రమే సొంత ఇల్లు ఉన్నాయి. అంటే మిగిలిన 70.63 శాతం మంది అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దెకు ఉండేవారు అత్యధికంగా ఉన్న జిల్లా కూడా హైదరాబాద్ కావడం గమనార్హం. కేవలం హైదరాబాద్ మాత్రమే కాదు, దానికి ఆనుకుని ఉన్న మెడ్చల్మల్కాజిగిరి (35.26%), రంగారెడ్డి (35.56%) జిల్లాల్లో కూడా సొంత ఇళ్ల శాతం చాలా తక్కువగా ఉంది.మొత్తానికి హైదరాబాద్ అంటే కేవలం ఐటి హబ్ మాత్రమే కాదు, అది ఇప్పుడు “రెంటల్ హబ్” గా కూడా మారిపో యింది. ప్రభుత్వం ప్రవేశపెట్టే హౌసింగ్ స్కీమ్లు, సరస మైన ధరల్లో ఇళ్ల నిర్మాణం చేపడితే తప్ప, సామాన్యుడి సొంత ఇంటి కల నెరవేరడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడు తున్నారు

# నకిలీ కరెన్సీ పై నజర్..!




**నర్సంపేట,ఫ్లాష్ ఇండియా :** నర్సంపేట పట్టణంలో నకిలీ నోట్ల చలామణి వ్యవహారం కలకలం రేపుతోంది. స్థానికంగా ఉన్న కొందరు యువకులు ఈ తతంగానికి పాల్పడినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసుల దృష్టికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి బలం చేకూరుస్తూ ఇటీవల నర్సంపేట పట్టణంలోని అంగడి సెంటర్ దగ్గరలో ఇద్దరు యువకులు, ద్వారక పేటకు చెందిన మరొక యువకుడిని విచారణ కోసం వరంగల్ కి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. చాపకింద నీరులా నకిలీ నోట్ల పంపిణీ, గంజాయి వినియోగం పట్టణంలో విస్తరిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ ముగ్గురితో పాటుగా వీరితో సంబంధం ఉన్న మరో కొందరిని సైతం విచారణకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

**నకిలీ నోట్లలో ఇవే అధికమట..!**

నర్సంపేట పట్టణంలో నకిలీ నోట్ల వ్యవహారం పోలీసులకు సవాలు విసురుతోంది. ముఖ్యంగా రూ.500, 200 నకిలీ నోట్లను సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏపీ నుంచి పట్టణానికి సరఫరా అవుతున్నట్లు సైతం చర్చ జరుగుతోంది. పట్టణానికి చెందిన అమాయక నిరుపేద, జులాయి యువకులే లక్ష్యంగా అధిక కమిషన్ ఆశ చూపెట్టి దందాలోకి దింపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. లక్ష నకిలీ నోట్లకు రూ. 25వేలు అసలు నోట్లు తీసుకుంటున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తుంది.

**చిరు వ్యాపారులే లక్ష్యం..!**

నకిలీ నోట్లను చెలామణిలోకి తెస్తున్న యువకులు చిరు వ్యాపారులను, బెల్ట్ షాపు నిర్వాహకులను, కూరగాయలు, పండ్ల వ్యాపారులను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నోట్లను పరిశీలించే అవకాశం చిన్న వ్యాపారులకు తక్కువగా ఉండటం, వీరిలో మెజారిటీ జనాలు నిరక్షరాస్యులు ఉండటంతో సులభంగా నోట్లను మారుస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా... గత వారం నుండి జరుగుతున్న ఈ విచారణల పర్వం పై స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేనట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబర్ నెలలో రూ.200 నకిలీ నోటు లభ్యం అయింది. వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు చెబుతున్నారు. కాగా ఇది అసలా లేక నకిలీనా అనే పరీక్ష కోసం ల్యాబ్ కి పంపినట్లు సమాచారం.

# కాంగ్రెస్ చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు..

**ఢిల్లీ :** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా చెన్నైలో జరిగిన ఒక విలేకరుల సమావేశంలో ఆయన ప్రధాని మోదీని ‘ఉగ్రవాది’తో పోలుస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సమానత్వ సిద్ధాంతాలను నమ్మని ప్రధాని, దక్షిణాది రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అసలు అలాంటి వారితో అన్నాడీఎంకే పొత్తు ఎలా పెట్టుకుందని ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని, పెరియార్, అంబేద్కర్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ పనిచేస్తోందని విమర్శించారు.

**వెంటనే వివరణ ఇచ్చుకున్న కాంగ్రెస్ అధ్యక్షుడు**

అయితే, తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఖర్గే వెంటనే నష్ట నివారణ చర్యలకు దిగారు. తాను మోడీని ‘ఉగ్రవాది’ అనలేదని, ఆయన ప్రజలను ‘భయభ్రాంతులకు గురిచేస్తున్నారని’ (టెర్రరైజింగ్) మాత్రమే అన్నానని వివరణ ఇచ్చారు. ‘ప్రధాని మోదీ ఎప్పుడూ బెదిరింపులకు పాల్పడుతుంటారు. ఐటీ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలన్నీ ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన ప్రజలను భయపెడుతున్నారు అని చెప్పానే తప్ప, ఉగ్రవాది అని నేను ఎప్పుడూ అనలేదు’ అని ఆయన స్పష్టం చేశారు.

# భూ రికార్డుల్లో సరికొత్త శకం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రైతు జీవితం భూమితో ముడిపడి ఉందని, ఆ భూమిపై హక్కులు స్పష్టంగా ఉన్నప్పుడే జీవితం భద్రంగా ఉంటుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ హక్కును సర్వే మ్యాప్, భూధార్ నంబర్‌తో శాశ్వతంగా నిర్ధారించినపుడే రైతుకు ధైర్యం, కుటుంబానికి భరోసా, భవిష్యత్తుపై నమ్మకం కలుగుతుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను సమూలంగా బలోపేతం చేస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధనను భూ భారతి చట్టంలో పొందుపరిచామని, అదే విధంగా ఎవరైనా స్వచ్ఛందంగా వారి ఆస్తులకు సంబంధించిన సర్వే సర్టిఫికేట్ కు కూడా దరఖాస్తు చేసుకొని ధృవీకరించుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా భూ భారతి చట్టంలో పేర్కొన్న విధంగా రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ ఉండాలన్న నిబంధనను ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కుసుమంచి మండలం మోటాపురంలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ చేసి చారిత్రాత్మకమైన అడుగు వేశామన్నారు. సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ అయిన సందర్భంగా మంత్రి స్పందిస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

**హద్దులతో మ్యాప్..**

కూసుమంచి మండలం మోటాపురం సర్వే నం.156/ఇ/1 లోగల ఒక 1.04 ఎకరాలను నేలకొండపల్లి మండలం ముత్తాపురం గ్రామానికి చెందిన చెందిన భాగం కిషన్‌రావు అనే రైతు అదే గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించారు. ఈ సందర్భంగా తన భూమి హద్దులతో కూడిన మ్యాప్ ను జతచేసి కూసుమంచి తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. దీనికి సంబంధించి ( భూ కమత పటము-1, భూధార్ నెంబర్ **795GCHDCUPJ7H0**) ను తహశీల్దార్ కేటాయించారు. ఇదే విధానాన్ని దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ వ్యవహారాల్లో పూర్తి స్థాయి పారదర్శకతను తీసుకొచ్చిందన్నారు. ప్రతి భూమికి ఖచ్చితమైన సర్వే మ్యాప్, ప్రత్యేక భూధార్ నంబరు కేటాయించడం ద్వారా యాజమాన్యంపై ఎలాంటి సందేహాలకు తావు లేకుండా చేస్తోందన్నారు. సర్వే విషయంలో పాత విధానాలకు స్వస్తి చెప్పి అధునాతన రోవర్లను వినియోగిస్తూ కచ్చితత్వంతో సర్వే పూర్తి చేయిస్తున్నామన్నారు.

# కౌంటింగ్ వరకూ స్ట్రాంగ్ రూమ్‌లు తెరవద్దు..

**తిరువనంతపురం:** కేరళలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందువరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లు తెరవరాదని ఆదేశాలిచ్చింది.కోజికోడ్‌లోని పెరంబ్ర నియోజకవర్గంలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచారని, పాలక్కాడ్‌లోని నెన్మర నియోజకవర్గంలో మరో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు ప్రయత్నించారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేరళ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రతన్ యు కేల్కర్ తాజా ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లు కానీ, సీల్‌వేయని రూములు కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రత, పారదర్శకత, భద్రతను పరిరక్షించేందుకు అధికారులంతా ఈ సూచనలను పాటించాలని కోరారు.కాగా, ఏ ఒక్క స్ట్రాంగ్ రూమ్‌ను తెరవలేదని కోజికోట్ జిల్లా యంత్రాంగం వివరణ ఇచ్చింది. పోలింగ్ రికార్డుల వెరిఫై, అప్‌డేట్ కోసం సీల్ చేయని మెటీరియల్ రూమ్‌ను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచినట్టు జిల్లా ఎన్నికల అధికారిగా కూడా ఉన్న కలెక్టర్ స్నేహిల్ కుమార్ సింగ్ తెలిపారు. బిల్డింగ్ మొదటి అంతస్తులోని సీల్ వేసిన గదిలో ఈవీఎంలు, వీవీపాట్‌లు ఉన్నాయని, కేంద్ర పరిశీలకులు, అభ్యర్థుల ఏజెంట్ల పర్యవేక్షణలో ఉన్న ఈ సీల్డ్ గదిని ఎవరూ తెరవలేదని చెప్పారు. 140 నియోజకవర్గాలున్న కేరళ అసెంబ్లీకి పోలింగ్ ఏప్రిల్ 9న జరిగింది. మే 4న ఫలితాలు వెలువడతాయి.




# ఖర్గేపై బండి సంజయ్ ఫైర్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే చేసిన ‘ఉగ్రవాది’ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీని టెర్రరిస్ట్ అని పిలవడం రాజకీయమే కాదు ఓటమిని అంగీకరించలేని నైరాశ్యం అని ధ్వజమెత్తారు. ఇలాంటి మాటలు మోడీకి పదే పదే మద్దతు తెలిపిన ఓటర్లను అవమానించడమేనన్నారు. ఈ మేరకు ఇవాళ ఎక్స్ వేదికగా బండి సంజయ్ ఓ పోస్టు చేశారు. కాంగ్రెస్ బ్యాలెన్స్ కోల్పోయి రాజకీయ దాడి మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య ఆత్మ దాడికి పాల్పడుతోందని దుయ్యబట్టారు.

**ఉగ్రవాదుల కోసం కన్నీరు పెట్టుకున్నారు:**

ఉగ్రవాదుల కోసం కన్నీరు కార్చి మన సైన్యం ధైర్యాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి భాష మాట్లాడటం అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దశాబ్దాల పాటు ఉగ్రవాదంతో దేశం రక్తమోడేలా చేసిన కాంగ్రెస్, ప్రధాని మోదీ హయాంలో ఆ ‘సాఫ్ట్ ఆన్ టెర్రర్’ విధానం అంతం కావడంతోనే ఈ నిరాశలో ఉందని పేర్కొన్నారు.2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ వంటి సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ పదేపదే శత్రువుల కథనాలను ప్రచారం చేసిందని, మన సైనికులనే ఆధారాలు అడిగిందని, దేశభావనలకు దూరంగా నిలిచిందని ఆరోపించారు. బీజేపీ సేవా రాజకీయాలను నమ్ముతుందని, దుర్భాషలను లేదా నిరాశను కాదని స్పష్టం చేశారు. ఖర్గే వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# కేసీఆర్ జగిత్యాల సభపై కవిత సెటైర్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో సీనియర్ రాజకీయ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా సోమవారం జగిత్యాలలో భారీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరై ఆయనను పార్టీలో చేర్పించుకొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. కాగా ఈ సభపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సెటైర్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రజా ఆశీర్వాద సభ'పై ఆమె ఘాటుగా స్పందించారు. జగిత్యాల సభలో కేసీఆర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కవిత సెటైర్లు వేశారు. "75 ఏళ్లు వచ్చిన వ్యక్తి నవ యువకుడైతే.. రాష్ట్రంలోని లక్షలాది మంది యువకులు ఏమవ్వాలి?" అని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్‌లో మహిళలకు గౌరవం లేదని, ఆ పార్టీ కేవలం స్వార్థ రాజకీయాల కోసమే పనిచేస్తోందని కవిత ఆరోపించారు. మమ్మల్ని ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం సరికాదని, ప్రజల తీర్పును గౌరవించకుండా వారిని తప్పుబట్టడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. కేసీఆర్ సభలో 'ఉట్టి కథలు' చెప్పారని, కాంగ్రెస్ 'పిట్ట కథలు' చెబుతోందని..

కానీ ప్రజల అసలు కష్టాల గురించి ఎవరూ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ ప్రజల గొంతుక అవుతుందని కవిత ధీమా వ్యక్తం చేశారు.

**జీహెచ్ఎంసీకి కవిత విజ్ఞప్తి...**

ఏప్రిల్ 25న మేడ్చల్‌లో తాను కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నట్లు కవిత ఇప్పటికే ప్రకటించారు. ఈ పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తామని, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కొత్త పార్టీ వస్తున్న నేపథ్యంలో పబ్లిసిటీ మెటీరియల్ (ఫ్లెక్సీలు, బ్యానర్లు) విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని ఆమె కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణలో ఒక కుటుంబమే బాగుపడింది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వేలాది అమరులైతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ఇవాళ వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే అందరి జీవితాలు మారుతాయని ప్రజలు ఆశించారని, కానీ గత పదేళ్లలో కేవలం ఒకే ఒక్క కుటుంబం బాగుడిందని ఆయన విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.వేల కోట్లు సంపాదించుకుందని ఆరోపించారు. ప్రజల సొమ్ముతో ఆ కుటుంబం ఆస్తులు పెంచుకుంటే, తెలంగాణ ప్రజల నెత్తిన మాత్రం రూ.వేల కోట్ల అప్పులు మిగిల్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో అప్రజాస్వామిక పద్ధతులు పెరిగిపోయాయని, అందుకే తాను ఆ పార్టీని వీడి కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు లేని చోట ఉండలేకే తాను ఆ నిర్ణయం తీసుకున్నానని కడియం తెలిపారు.

**అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం..**

తన రాజకీయ జీవితంపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీకి సంచలన సవాల్ విసిరారు. తాను తన రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ చిన్న తప్పు కూడా చేయలేదని, ఎక్కడా అవినీతికి పాల్పడలేదని అన్నారు. ఒకవేళ అవినీతి చేసినట్లుగా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేస్తానని కుండబద్దలు కొట్టారు. నిబద్ధతతో పనిచేసే తనపై అసత్య ఆరోపణలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని కడిమం బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

# కేసీఆర్ విద్యనే రేవంత్ ప్రయోగిస్తున్నారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిన్నటి సభలో సీఎం రేవంత్ రెడ్డి , మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరూ తుపాకీ రాముడు మాటలే మాట్లాడారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధం వీణావాణి లాంటిదని పైకి వేర్వేరుగా కనిపిస్తున్నా ఈ రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ స్టేట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. గతంలో ప్రధాని మోడీ తెలంగాణ వస్తే బీఆర్ఎస్ ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చి బీజేపీ వార్తలు రాకుండా చేశారు. ఇప్పుడు అదే విద్యను రేవంత్ రెడ్డి ప్రయోగిస్తున్నారని ఇద్దరూ ఒకేరోజు సభలు పెట్టి చెరో సగం పేజీ వార్తలు వచ్చేలాగా డ్రామాలు చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక నివేదిక మీద కాకుండా కాళేశ్వరం అనుమతుల నుంచి ఇప్పటి వరకు అన్నింటిపై సీబీఐకి అప్పగించి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన కంపెనీ మేనేజ్ చేస్తున్నదని, ఈ కంపెనీకే మూసీ పనులు కూడా



అప్పగిస్తున్నారని ఆరోపించారు.

**కవితను అప్రూవర్‌గా మార్చండి:**

జగిత్యాల నుంచే తమ జైత్రయాత్ర ప్రారంభం కాబోతోందన్న బీఆర్ఎస్ వ్యాఖ్యలకు రఘునందన్ కౌంటర్ ఇచ్చారు. గతంలో జగిత్యాల జైత్రయాత్ర చేసిన నక్సలైట్లు ఆపై మావోయిస్టులుగా మారి ఇప్పుడు కనుమరుగైపోయారని టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిందని జలదృశ్యం నుంచి ఆ పార్టీ అదృశ్యం అవుతున్నదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో అవినీతి జరిగిందని కేసీఆర్ బిడ్డ స్వయంగా చెప్పిందని కవితని అప్రూవర్‌గా మార్చి వాళ్ళను అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. బూతులు బంజేసి... ప్రజల కోసం పని చేయ్యండని పిలుపునిచ్చారు.

**అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు:**

కేసీఆర్, రేవంత్ పాలన వల్ల తెలంగాణలో ఫసల్ బీమా లేక రైతులు అల్లల్లాడుతున్నారని మెదక్ పార్లమెంట్‌లో మూడు మండలాల్లో అకాల వర్షాలకి ఒక్క వడ్ల గింజ మిగల లేదన్నారు. చేగుంట, నార్సింగి, మాసాయిపేట మూడు మండలాలలో ఏడు గ్రామాల రైతులు ఏడుస్తున్నారని ఆరు వేల ఎకరాలు పైగా నష్టం వాటిల్లిందన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ..రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు అంటారు. అటు కేసీఆర్ సర్కారు..ఇటు రేవంత్ సర్కారు వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. కేసీఆర్ సర్కారు చేసిన లక్ష కోట్ల అవినీతి ని కక్కిస్తాం అని రేవంత్ రెడ్డి గారు రాహుల్ చేత చెప్పిచ్చారని ఇప్పుడు ఎక్కడికిపోయారని నిలదీశారు.

# రహస్యమేమీ లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మరోసారి నిప్పులు చెరిగారు. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేకెత్తించిన 'ఓటుకు నోటు' కేసు నుండి మొదలుకొని ఎమ్మెల్యేల ఫిరాయింపుల వరకు ప్రతి అంశంపై ఆయన ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందనేది కేవలం ఒక కల మాత్రమేనని, కనీసం రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కాపాడుకోవడానికైనా రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకుని బాధ్యతగా పని చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రతిపక్ష నేత కేసీఆర్ చేసే సూచనలను పరిగణలోకి తీసుకుంటే ప్రభుత్వానికి కొంతైనా గౌరవం దక్కుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఢిల్లీ పర్యటనపై జరుగుతున్న ప్రచారాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ పరమైన పనుల కోసం ఎంపీ రవిచంద్ర, వినోద్ కుమార్‌లతో కలిసి బహిరంగంగానే ఢిల్లీ వెళ్లామని, ఇందులో దాచడానికి ఎలాంటి రహస్యాలు లేవని స్పష్టం చేశారు. అయితే సీఎంఓ నుండి మీడియాకు లీకులు ఇస్తూ రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా సుప్రీం కోర్టులో విచారణకు రానున్న 'ఓటుకు నోటు' కేసు విషయంలో రేవంత్ రెడ్డి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. పట్టపగలు రూ. 50 లక్షల నగదుతో దొరికిన దొంగే ఈరోజు రాష్ట్రానికి హోమ్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తనపై ఉన్న కేసును నీరుగార్చడానికి ప్రభుత్వం తరఫున నామమాత్రపు న్యాయవాదులను పెట్టి, తన వ్యక్తిగత రక్షణ కోసం దేశంలోనే పేరుగాంచిన ఖరీదైన లాయర్లను రేవంత్ రెడ్డి నియమించుకున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు, ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా చేర్చుకుంటూ రాజ్యాంగ భక్షకులుగా మారుతున్నారని హరీష్ రావు విమర్శించారు. ఇప్పటికే ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసిందని, మే 6వ తేదీన హైకోర్టులో జరగబోయే విచారణలో తమకే విజయం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో కూడా న్యాయం తమ వైపే ఉందని, ధర్మం కోసం తాము ఎంతటి న్యాయపోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ తరఫున తాము కూడా ఇంప్లీడ్ అయ్యామని, ఆనాడు తమ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడేలా చూస్తామని హరీష్ రావు హెచ్చరించారు. ఒక బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా ప్రభుత్వ అక్రమాలను ఎండగడుతూనే ఉంటామని ఆయన తేల్చి చెప్పారు.

# కాళేశ్వరంపై సీబీఐతో విచారణ చేయించు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది రాహుకేతు గ్రహమని బండి సంజయ్ అంటున్నారని.. అసలు బండి సంజయ్ ఏ గ్రహమని ఎద్దేవా చేశారు. అసలు నవగ్రహాల్లో ఆయన ఉన్నారా...? అని ప్రశ్నించారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్ వేదికగా మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. బండి సంజయ్ ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారని విమర్శించారు. తెలంగాణలోని పెండింగ్ సమస్యలను పరిష్కారించాలనే ఆలోచన ఆయనకు ఏమైనా ఉందా...? అని నిలదీశారు. మెట్రో పేజ్ 2, ట్రిపుల్ ఆర్, మూసీ ప్రక్షాళన విషయంలో బండి సంజయ్ వైఖరి ఏంటి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. భువనగిరి లోక్‌సభ పరిధిలో నిధులు తీసుకువచ్చే సభను కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కలిసి పెట్టాలని.. పార్టీలకు అతీతంగా ప్రజలను తీసుకువచ్చే బాధ్యత తమదని చెప్పుకొచ్చారు.

**కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేయట్లేదు..**

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశిస్తే 24 గంటల్లో చర్యలు చేపడతామని కిషన్ రెడ్డి అన్నారని.. మరి ఇప్పుడేమి చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. 2025 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఇస్తే ఇప్పటి వరకు విచారణ ఎందుకు చేయట్లేదని నిలదీశారు. అనవసరమైన అంశాల్లో కేంద్ర జేబు సంస్థలు సీబీఐ, ఈడీ, ఐటీని దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బండి సంజయ్ శాఖ పరిధిలోనే సీబీఐ ఉంది కదా...? అని ప్రస్తావించారు. బండి సంజయ్ ఏ గ్రహమో.. చెప్పి తెలంగాణకు ఏం చేశారో సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం కుప్పకూలిందని అన్నారు. కాళేశ్వరంలో బీఆర్ఎస్ లక్ష కోట్లు దోచుకుందని ఆరోపించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని చెప్పిన మోదీ అండ్ కో ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో బండి సంజయ్ ఎంపీగా, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌కి కాళేశ్వరం ఏటీఎంగా మారడానికి అక్కడ ఏముందో బండి సంజయ్ చెప్పాలని ప్రశ్నించారు.

**జీవన్ రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్ చేయాలని అనుకున్నాం..**

జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లి ఆలోచన లేని పని చేశారని.. కేసీఆర్ ఆయనకు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డిని పీసీసీ ప్రెసిడెంట్‌గా చేయాలని అనుకున్నామని తెలిపారు. నిన్నటితో జీవన్ రెడ్డి ఎపిసోడ్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లో అలిగినట్లు బీఆర్ఎస్‌లో అలిగితే ఎవరు పట్టించుకోరని విమర్శించారు. కాంగ్రెస్‌లో అలిగితే టీపీసీసీ ప్రెసిడెంట్, ఏఐసీసీ సెక్రటరీలు జగిత్యాల దాకా వచ్చారని ప్రస్తావించారు. జనరల్ సెక్రటరీ పదవికి కాంగ్రెస్‌లో ఏ స్థాయి ఉంటుందో జీవన్ రెడ్డికి తెలుసునని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పీసీసీ ప్రెసిడెంట్‌గా చేసి బీఆర్ఎస్‌లో చేరితే ఇప్పుడు పరిస్థితి ఏంటి...? అని ఎద్దేవా చేశారు. పొన్నాలకు పట్టిన గతే.. రేపు జీవన్ రెడ్డికి పడుతుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు గుప్పించారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం



**చెన్నూర్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అభివృద్ధి సాధ్యపడుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు జర్మనీ దేశంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కార్మిక భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంగన్ వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్ వాడీ టీచర్లకు అందిస్తున్న సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజా పాలన కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రతి లబ్ది దారులకు అందుతున్నాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ప్రజల సొమ్మును వృథా చేసి కల్వకుంట్ల కుటుంబం కోట్లు సంపాదించారని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తాను తెచ్చిన నిధులే ఇప్పుడు ఖర్చు చేస్తున్నారని అనడం సిగ్గుచేటు అన్నారు. అప్పుడు నిధులు ఉంటే అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఎందుకు వదిలేసారో చెప్పాలన్నారు. కేవలం సోషల్ మీడియాను అడ్డు పెట్టుకొని ప్రభుత్వం మీద అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఆయన అన్నారు. ఇక్కడ యువతకు ఉపాధి కల్పించడానికి జర్మనీ సంస్థ టామ్ కామ్ తో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని.. యువకులు జర్మనీలో ఉపాధి పొందాలంటే క్యాంపు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. అనంతరం 37 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మా శ్రీనివాస్, వైస్ చైర్మన్ వినయ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ స్పెషల్ ఫోకస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత రాష్ట్ర సమితి మరో ముఖ్యమైన సమావేశానికి సిద్ధవ-ఎవుతోంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హై కమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశం చేయనున్నారు.

**సంస్థాగత నిర్మాణంపై కేసీఆర్ ఫోకస్..**

ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరించడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం.

**సమావేశానికి ముఖ్య నేతలు...**

ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సమగ్ర సమీక్ష చేయనున్నారు.

**భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలపై చర్చ..**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమ్మచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది.

# ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ములకపల్లి,ఫ్లాష్ ఇండియా :** మండల పరిధిలోని కొమ్ముగూడెం రైతు వేదిక వేదికగా మంగళవారం సంక్షేమ కార్యక్రమాల సందడి నెలకొంది. స్థానిక మహిళలు, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శాసనసభ్యులు జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని పలు పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. గర్భిణీ స్త్రీల సౌకర్యార్థం ప్రభుత్వం అందజేస్తున్న శ్రీమంతం కిట్లను 38 మంది మహిళలకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. విద్యాబుద్ధులు ఆరంభానికి సూచికగా 10 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే మరో ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం విధుల్లో పారదర్శకత వేగం పెంచే ఉద్దేశంతో అంగన్వాడీ టీచర్లకు నూతన సెల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య రక్షణ, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా క్షేత్ర-స్థాయిలో పౌష్టికాహారం, విద్య మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక నాయకులు కారం సుధీర్, రవి, జహీర్, వంశీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తలకిందులుగా వేలాడదీసి, బుద్ధి చెబుతాం

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం డార్జిలింగ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. మే 5 తర్వాత బెంగాల్ పౌరులను, ముఖ్యంగా కొండ ప్రాంత ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీసి, సరిచేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మమతా దీదీకి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ సభలో అమిత్ షా బెంగాల్ ఓటర్లపై వరాల జల్లు కురిపించడంతో పాటు, మమత సర్కారుపై కీలక ఆరోపణలు చేశారు.

**గూర్ఖాల సమస్య పరిష్కారం..**

'బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలు, నిరుద్యోగ యువత ఖాతాల్లో ప్రతి నెలా రూ. 3,000 చొప్పున జమ చేస్తాం. తేయాకు తోటల్లో పాఠశాలల నిర్మాణం చేపడతాం. కార్మికులకు భూమి పట్టాలు ఇచ్చి యజమానులను చేస్తాం. రాబోయే రెండేళ్లలో వారి వేతనాన్ని రూ.500కు పైగా పెంచుతాం. దశాబ్దాలుగా ఉన్న గూర్ఖాల సమస్య పరిష్కారానికి కేంద్రం మూడు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా మమత ప్రభుత్వం సహకరించలేదు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే గూర్ఖాల ఆకాంక్షల మేరకు ఈ సమస్యను శాశ-ఽ్వతంగా పరిష్కరిస్తాం.' అని ప్రధాన హామీలు అమిత్ షా వివరించారు.

**మమత సర్కారుపై విమర్శలు..**

గిరిజనులు, ఉత్తర బెంగాల్, డార్జిలింగ్ ప్రాంతాల అభివృద్ధికి కేవలం రూ. 2 వేల కోట్లు కేటాయించిన మమత సర్కార్.. మదర్సాలు, ముస్లింల కోసం ఏకంగా రూ. 5,700 కోట్లు కేటాయించి తీవ్ర వివక్ష చూపుతోందని ఆరోపించారు. సందేశ్‌ఖాలీ ఘటన యావత్ బెంగాల్‌కే అవమానకరమని, టీఎంసీ పాలనలో మహిళలపై అకృత్యాలు పెరిగాయని, బీజేపీ అధికారంలోకి వస్తే నిందితులను ఏరికోరి జైలుకు పంపుతామని అన్నారు. కాగా, పశ్చిమ



బెంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) నిర్వహించనున్నారు. 2011 నుంచి అధికారంలో ఉన్న మమతా బెనర్జీని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు రచిస్తుండగా, బీజేపీని 'బయటి వ్యక్తుల పార్టీ'గా ముద్ర వేస్తూ టీఎంసీ తన ఓటు బ్యాంకును కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.

# సంపాదకీయం

## నిండుగా.. జలాలు!

తెలంగాణ రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి, భూగర్భ జలమట్టం 8.22 మీటర్ల లోతుకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో సగటు భూగర్భ జలమట్టం 9.91 మీటర్లు ఉండగా.. ఈ ఏడాది 1.69 మీటర్లలోనే నీటి మట్టం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,771 పర్యవేక్షణ కేంద్రాల ఆధారంగా భూగర్భ జలశాఖఈ డేటాను సేకరించింది. భూగర్భ జలశాఖ డైరెక్టర్ కె. లక్ష్మ మీడియాకు ఈవివరాలు వెల్లడించారు. గత రుతుపవన కాలంలో 37% అధిక వర్షపాతం కురవడమే ఈ బలమైన భూగర్భ జలమట్టాలకు కారణ మని తెలిపారు. రాష్ట్రంలో సాధారణంగా కురవాల్సిన 876 మిల్లీమీటర్లకు బదులుగా 1,197 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది మార్చి నాటికి ఖమ్మం జిల్లాలో సగటు భూగర్భజలమట్టం కేవలం 4.52 మీటర్లుగా ఉండగా.. వికారాబాద్ 13.72 మీటర్లతో దాని తర్వాతి స్థానంలో ఉంది.

**మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి జిల్లాల్లో..**

మెడ్చల్మల్కాజిగిరి జిల్లాలోని కూకట్పల్లి, బాచుపల్లి, దుండిగల్ మండలాల్లోని కొన్ని ప్రాంతాలు, అలాగే.. రంగారెడ్డి జిల్లాలోని సరూర్నగర్, శేరిలింగంపల్లిలతో సహా నగరంలోని ఏడు శాతం ప్రాంతాల్లో భూగర్భజలమట్టం 20 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉందని భూగర్భ జలవనరుల శాఖ అధికారి లక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని ఉత్తర, వాయువ్య, తూర్పు భాగాల్లో మరో 14 శాతం ప్రాంతంలో భూగర్భ జలమట్టం 1520 మీటర్ల మధ్యస్తంగా లోతుగా ఉంది. భూగర్భ జలమట్టం 20 మీట ర్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండటం అనేది భూగర్భజలమట్టం అత్యంత లోతుగా ఉందని సూచి స్తుంది. ఇది భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడాన్ని, ప్రతికూల పర్యావరణ పరిణామాలను తెలియజేస్తుంది.

**సిటీలో తోడేస్తున్న బోర్వెల్స్..**

కుతుబుల్లాపూర్లో అత్యధికంగా 28.01 మీటర్ల భూగర్భజలమట్టం ఉందని, ఆ తర్వాత కూకట్పల్లిలో 27 మీటర్లు, ఎస్ఆర్ నగర్లో 20.46 మీటర్లు, చెంగిచెర్లలో 19,60 మీటర్లు, మల్కాజిగిరిలో 17.91 మీటర్ల భూగర్భ జలమట్టం ఉందని ఆ శాఖ ఫీజోమటీర్లు నిర్ధారించాయి. గ్రేటర్ హైద రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో, భూగర్భ జలమట్టాలు 1.68 మీటర్ల నుంచి 28.01 మీటర్ల మధ్య ఉండగా, సగటున 10.10 మీటర్ల లోతులో ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో బోర్వెల్స్ ద్వారా అధికంగా నీటిని తోడ టం వల్ల భూగర్భ జలమట్టాలు రాష్ట్ర సగటు కంటే దిగువకు పడిపోయాయి.

**కుత్బుల్లాపూర్ లో నీటి కష్టాలు..**

మేడ్చల్మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ ప్రాంతం అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ఇక్కడ భూగర్భజలమట్టం 28.01 మీటర్ల లోతులో ఉంది. ఈ ఏడాది మార్చి నెలలో నగరంలో సగటున నీటిమట్టాలు గత దశాబ్దపు మార్చి నెల సగటు (201625)తో పోలిస్తే పెరిగాయి. 27 మండలాల్లో అతి తక్కువ నుంచి 9.97 మీటర్ల లోతు వరకు, 13 మండలాల్లో 2 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువగా నీటిమట్టం నమోదైంది. జీహెచ్ ఎంసీ పరిధిలో సాధారణ 771 మిల్లీమీటర్లకు బదులుగా 1,036 మిల్లీమీటర్ల వర్షపా పరపాతం సమోదు కావడంతో, 34% అధిక వర్షపాతమే దీనికి ప్రధాన కారణం

## సీక్రెట్ రిపోర్ట్ ఇచ్చారా?

తెలంగాణలో కమలం ఎదుగుదలకు సంబంధించిన అత్యంత కీలకమైన సీక్రెట్ రిపోర్ట్ ఢిల్లీ పెద్దలకు చేరిందా? పార్టీలో సమన్వయ లేమి, నాయకుల మధ్య గ్యాప్లాంటి అనేక ముఖ్యమైన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని చాపకింద నీరులా హైకమాండ్ తెప్పించుకుందా? అసలు రాష్ట్ర నాయకులు ఎవ్వరూ ఊహించలేని వ్యక్తి ఒకరు సమగ్ర సమాచారాన్ని పైకి పంపారా? దానికి సంబంధించి అధికారికంగా ఎలాంటి కన్ఫర్మేషన్ లేనప్పటికీ అదే నిజమా? డిటైల్డ్ రిపోర్ట్ ఎవరు పంపారని స్టేట్ పార్టీలో చర్చ జరుగుతోంది? తెలంగాణ బీజేపీలో ఎప్పుడూ ఏదో ఒక రచ్చ. కొన్ని పైకి కనిపిస్తే.... ఎక్కువ వివాదాలు లోలోపలే పెరిగిపోయి అంతర్గత కుమ్ములాటలకు దారి తీస్తున్నాయి. పార్టీలో పాత–కొత్తల పంచాయితీ ఇప్పటికీ తేలలేదు, ఎప్పటికి తేలుతుందో ఎవరికీ తెలియదు. ఎన్నికల్లో అందరం పార్టీ కోసం పని చేశాం, జెండా మోశాం, ఇక పాతేంది? కొత్తేంది? అన్న వాదన ఒకవైపు నడుస్తుండగానే... మరోవైపు రెండు వర్గాల మధ్య కంటికి కనిపించని అడ్డుగోడ ఇప్పటికీ బలంగానే ఉందని చెప్పుకుంటున్నాయి కాషాయ వర్గాలు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా రాష్ట్రంలో పాగా వేయాలని ఉవ్విళ్యూ–రుతోంది కేంద్ర నాయకత్వం. ఆ దిశగా ఇక మీదట దృష్టి పెట్టవచ్చుంటున్న రాష్ట్ర పార్టీ వర్గాలు... అదే క్రమంలో ఓ సీక్రెట్ రిపోర్ట్ గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నాయి. మొత్తం... పిన్ టు పిన్..... అస్సలు తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోందో డిటైల్డ్ రిపోర్ట్ను ఓ పెద్దాయన ఢిల్లీకి పంపారన్నది ఆ చర్చల సారాంశం.ప్రస్తుతం పార్టీ లీడర్షిప్ మొత్తం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల మీద దృష్టి పెట్టినందున అవి అయిపోగానే... తెలంగాణ, కర్ణాటక మీద ఫోకస్ పెడతారని సమాచారం ఉంది. దీంతో ఆ సీక్రెట్ రిపోర్ట్ గురించి కొందరు నాయకులు కంగారు పడుతున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో పార్టీ పరిస్థితి ఆశించినట్టుగా లేదన్న అభిప్రాయంతో ఉన్నారు ఢిల్లీ పెద్దలు. దీని గురించి ఓపెన్గానే మాట్లాడుకుంటున్నారు. ప్రధాని మోడీ స్వయంగా క్లాస్ తీసుకున్నా... ఇక్కడి నేతలు మారలేదని, వ్యవహారం మొత్తం కుక్క తోక వంకరే అన్నట్టుగా ఉందంటూ పార్టీ అభిమానులు ఘాటుగానే రియాక్ట్ అవుతున్నారు. చాలామంది నేతలు పార్టీ బాగు కోసం పని చేస్తున్నారా? లేక తమ వ్యక్తిగత ఇమేజ్ కోసం ఆరాటపడుతున్నారా అనే చర్చ కూడా ఉంది. అధికారంలోకి రావడం కోసం ఉమ్మడిగా పనిచేయాల్సింది పోయి పెద్దలకు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారన్న మాటలు సైతం వినిపిస్తున్నాయి కాషాయ వర్గాల నుంచి. ఈ పరిణామాలన్నిటినీ ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్న హస్తిన నాయకులు... తెలంగాణలో అసలేం జరుగుతోందంటూ అప్పుడప్పుడూ ఆరా తీస్తూనే ఉన్నారట. ఈ క్రమంలో రాష్ట్ర మాజీ గవర్నర్ ఇచ్చారని చెబుతున్న రిపోర్ట్ పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్గా ఉన్న జిష్ణుదేవ్ వర్మ అంతకు ముందు తెలంగాణ గవర్నర్గా పని చేశారు. ఆయన మహారాష్ట్రకు వెళ్ళడానికి ముందు తెలంగాణలో అసలు పార్టీ ఎలా ఉంది? నాయకుల తీరు, తీసుకోవాల్సిన చర్యల గురించి ఒక పూర్తిస్థాయి రహస్య నివేదికను ఢిల్లీ పంపినట్టు తాజాగా పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.తెలంగాణ నుంచి వెళ్ళడానికి కొద్ది రోజుల ముందే వర్మ ఆ రిపోర్ట్ ఇచ్చారంటూ పార్టీలోని అత్యంత విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆ నివేదిక సంగతి కొందరు ముఖ్య నేతల దృష్టికి వచ్చిందని, ఒకరిద్దరైతే దాని గురించి డిస్కస్ చేసినట్టు కూడా ఇప్పుడు మాట్లాడుకుంటున్నారు కమలం లీడర్స్. దీంతో ఆ రిపోర్ట్లో ఏముందంటూ ఆసక్తిగా ఢిల్లీలో తమకు తెలిసిన నాయకుల్ని ఆరా తీస్తున్నారట స్టేట్ లీడర్స్. తెలంగాణలో పార్టీ పరిస్థితి, నేతల మధ్య సమన్వయం లేక పోవడం, క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులు, ముఖ్య నేతలు వ్యవహరిస్తున్న తీరు లాంటి చాలా అంశాలు ఆ రిపోర్ట్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఓవరాల్గా రాష్ట్రంలో పార్టీ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదని ఫైనల్ కన్క్లూజన్ ఇచ్చారట. అయితే ఆ నివేదికకు సంబంధించిన ఎలాంటి అధికారిక కన్ఫర్మేషన్ లేదు. గవర్నర్ ఆఫీస్ నుంచి అఫీషియల్గా ఎలాంటి రిపోర్ట్ పంపలేదని చెబుతున్నాయి రాజ్భవన్ వర్గాలు. అధికారిక ధృవీకరణ సంగతి ఎలా ఉన్నా....జిష్ణుదేవ్వర్మ రాష్ట్ర గవర్నర్గా ఉన్నప్పుడు మాత్రం పూర్తి నివేదిక కేంద్ర పార్టీకి చేరిందని బలంగా నమ్ముతున్నాయి తెలంగాణ బీజేపీ వర్గాలు.






## ముందుకు.. సాగేదెలా?

### సంక్షోభంలో వ్యవసాయ రంగం

భారత వ్యవసాయ రంగం ప్రస్తుతం మునుపెన్నడూ లేని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంచనాలకు తగ్గట్టుగా కురవని వర్షాలు, పశ్చిమ ఆసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు వెరసి.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కుంగదీసే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు మరింత ఆందోళనను పెంచుతున్నాయి. 2026 నైరుతి రుతుపవనాలపై ఐఎండీ విడుదల చేసిన తొలి దీర్ఘకాలిక అంచనా షాకింగ్ వివరాలను వెల్లడించింది. ఈ ఏడాది వర్షపాతం దీర్ఘకాల సగటులో కేవలం 92 శాతంగానే నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గత 25 ఏళ్లలో ఇంత తక్కువ స్థాయిలో ప్రారంభఅంచనా వెలువడటం ఇదే తొలిసారి. రెండేళ్లుగా సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసిన నేపథ్యంలో, ఈ ఏడాది అంచనా వ్యవసాయ రంగానికి గట్టి ఎదురుదెబ్బగా పరిణమించేలా ఉంది.



**వ్యవసాయానికి తప్పని యుద్ధం సెగ**

ప్రకృతి కన్నెర్ర చేయడమే కాకుండా, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు కూడా వ్యవసాయ ఖర్చులను పెంచేలా ఉన్నాయి. పశ్చిమ ఆసియాలో సాగుతున్న సంఘర్షణల వల్ల గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎరువులు, పురుగుల మందుల తయారీలో గ్యాస్ అత్యంత కీలకం. యుద్ధం కారణంగా వీటి ధరలు పెరగడం లేదా లభ్యత తగ్గడం వల్ల రైతుపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. మంచి పంట పండాలంటే కేవలం నీరు ఉంటే సరిపోదు, సరసమైన ధరకే ఎరువులు దొరకాలి. కానీ ఇప్పుడు ఆ రెండు అంశాలూ అనిశ్చితిలో ఉన్నాయి.

**మే నెలపైనే ఆశలు**

ప్రస్తుతానికి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్ప టికీ, మే చివరిలో ఐఎండీ విడుదల చేసే సవరిం చిన నివేదిక కోసం నిపుణులు వేచి చూస్తున్నారు. గతంలో తొలి అంచనాలకు, వాస్తవ వర్షపాతానికి మధ్య వ్యత్యాసాలు ఉన్న ప్పటికీ, ఆధునిక సాంకేతికత వల్ల ఇప్పుడు ఆ తేడా తగ్గుతోంది. సగటున 87 సెం.మీ. కుర వాల్సిన వర్షం ఈసారి 80 సెం.మీకే పరిమిత మైతే, అది దేశ జీడీపీ గణాంకాలపై, గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఉద్యానవన పంటలు, పొగాకు, రబ్బరు వంటి వాణిజ్య పంట లు కూడా ఈ ప్రభావాన్ని చవిచూడనున్నాయి.

**ఖరీఫ్కు వాన గండం..**

రుతుపవనాల పనితీరుకు, వ్యవసాయ వృద్ధికి విడదీయలేని సంబంధం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ దిగుబడులకు, వర్షపాతానికి మధ్య 0.64 సంబంధిత గుణకం ఉంది. అంటే, వర్షం తగ్గితే ఖరీఫ్ పంటలు కుదేలవడం ఖాయం. ప్రస్తుతం దేశంలో కేవలం 50 నుంచి 60 శాతం భూమికి మాత్రమే నీటిపారుదల వసతి ఉంది. మిగిలిన సగం సాగు పూర్తిగా రుణుడి కరుణపైనే ఆధారపడి ఉంది. వర్షపాతం 96 శాతం కంటే తక్కువ ఉంటే వ్యవసాయ వృద్ధి రేటు గణనీయంగా పడిపోతుందని చారిత్రక డేటా చెబుతోంది.

## ఎండుగడ్డితో.. బయో గ్యాస్!

### ఇక గడ్డి కూడా బంగారమే



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. నిన్నటి వరకు అనవసర వ్యర్థంగా, కాలుష్య కారకంగా భావించిన వరిగడ్డి, ఇప్పుడు రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతోంది. తెలంగాణ ప్రభుత్వం, జానో జూల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా చేపట్టిన భారీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుతో తెలంగాణ ఇంధన రంగంలో సరికొత్త చరిత్రను లిఖించబోతోంది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం నర్మెట్ట పారిశ్రామిక ప్రాంతంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, వరిగడ్డిని 'బంగారం'గా మార్చబోతోంది. రాష్ట్ర పారిశ్రామిక, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో భూమిపూజ జరుపుకున్న ఈ ప్రాజెక్టు ₹700 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటోంది. మొత్తం 10 ప్లాంట్లను ఒకే క్లస్టర్గా ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో భాగంగా ₹210 కోట్లతో మూడు ప్లాంట్లను నిర్మిస్తున్నారు. ఈ ప్లాంట్లు రోజుకు 30 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభం కానున్నాయి. 202930 నాటికి పది ప్లాంట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, రోజువారీ ఉత్పత్తి 100టన్నులకు చేరుకుంటుంది.

**రైతులకు అదనపు ఆదాయం..**

వరి కోతల తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరిగడ్డిని తగుల బెట్టడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది. అయితే.. ఇకపై రైతులు గడ్డిని తగలబెట్టాల్సిన అవసరం లేదు. జానో జూల్ సంస్థ నేరుగా రైతులతో ఒప్పందాలు చేసుకుని, వారి పొలాల నుంచే గడ్డిని సేకరిస్తుంది. దీనివల్ల రైతులకు పంట ఆదాయంతో పాటు గడ్డి అమ్మకం ద్వారా అదనపు నగదు లభిస్తుంది. వరిగడ్డితో పాటు కోళ్ల వ్యర్థాలు,పశువుల పేడ వంటి సేంద్రియ పదార్థాలను కూడా ఈ ప్లాంట్లలో ఇంధనంగా మారుస్తారు.

**ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు..**

ప్రస్తుతం భారతదేశం తన ఇంధన అవసరాల కోసం 65శాతానికి పైగా ఇతర దేశాల నుంచి దిగుమతులపై ఆధారప డుతోంది. ఈ బయోగ్యాస్ ప్రాజెక్టుల ద్వారా స్వదేశీ ఇంధన ఉత్పత్తి పెరిగి, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఉత్పత్తి అయిన గ్యాస్ను నేరుగా సిటీ గ్యాస్ గ్రిడ్లోకి సరఫరా చేసేందుకు ఇప్పటికే గెయిల్, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయి. ఇది కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'గోబర్ ధన్, సతత పథకాలకు వెన్నుముకగా నిలుస్తుంది.

**పర్యావరణ హితం.. ఉపాధి కల్పన..**

ఈ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. గడ్డి తగులబెట్టడం వల్ల కలిగే వాయు కాలుష్యాన్ని నిరోధించడమే కాకుండా, వ్యర్థాల నుంచి గ్యాస్ తీయగా మిగిలిన 'డైజె స్ట్'ను నాణ్యమైన సేంద్రియ ఎరువుగా రైతులకు తిరిగి అందించవచ్చు. తద్వారా రసాయన ఎర–వుల వాడకం తగ్గి భూసారం పెరుగుతుంది. మరోవైపు, ఈ క్లస్టర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 1,400 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ముఖ్యంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ, మొత్తం ఉద్యోగాల్లో 30% మహిళలకే కేటాయించడం విశేషం. "వ్యర్థాల నుంచి ఆదాయం" అనే నినాదంతో సాగుతున్న ఈ ప్రయాణం తెలంగాణ రైతులకు వరప్రసాదమే. సామాన్య రైతును ఇంధన ఉత్పత్తిదారుగా మార్చడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రాజెక్టు, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవనుంది. వరిగడ్డి ఇక వ్యర్థం కాదు.. అది రైతు ముంగిట బంగారంగా మారబోతోంది.

# మాకు న్యాయం చేయండి..

## హైడ్రా ప్రజావాణిలో అమీన్‌పూర్ పేదల వేడుకోలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 'ఒకరా ఇద్దరా.. అందరూ ముఖీం అనుచరులే.. ముఖీం పెద్ద లాయర్ మా వెంట ఉన్నారు.. మీకేం కాదు.. మేం చూసుకుంటాం.. అని నమ్మబలికి మాకు 70 గజాల చొప్పున ప్లాట్లు అమ్మేశారు. ప్రభుత్వ భూమి అని మాకు తెలియదు.. అందరూ కొనుక్కుంటున్నారు.. అలాగే మేమూ కొనుక్కున్నాం.. ఇప్పుడు వారిని అడిగితే మాకేమి తెలీదు.. ఖాళీ జాగా ఉంచొద్దు.. వెంటనే ఇల్లు కట్టుకోండి అని చెబితే మీరు వినలేదని తిరిగి మమ్మలనే దబాయిస్తున్నారు. మా డబ్బులు మాకిచ్చేయండి అంటే.. అవెప్పుడో ఎవరి వాటాలు వారికి వెళ్లిపోయాయి.. మా దగ్గర లేవని దాటేస్తున్నారు. మా నోటరీలు.. అగ్రిమెంట్లు చూసి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి' అంటూ సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలంలోని ఐలాపూర్ కు చెందిన వందలాది మంది బాధితులు సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేశారు. కురుమ మల్లేష్, మాణిక్ యాదవ్, రవి నాయక్, రామచంద్ర నాయక్ తదితరులు ముఖీం అనుచరులుగా వేర్వేరు పేర్లతో అగ్రిమెంట్లు, నోటరీలు చేసి అమ్మారంటూ పేర్కొన్నారు. 'కూలీ డబ్బులు చిట్టీలు వేసుకుని.. ఊళ్లలో ఉన్న కాస్త పొలం అమ్ముకుని.. నానా అవస్థలు పడి ప్లాట్లు కొనుక్కొన్నాం. ఇప్పుడెవరూ పలకడంలేదు' అని ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. వీటికి తోడు.. నగరంలో ప్రభుత్వ భూములు, యూ–ఎల్‌సీ ల్యాండ్స్, అసైన్డ్ భూములు కబ్జాలకు గురౌతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఔటర్ రింగు రోడ్డు నిర్మాణంలో సేకరించిన అసైన్డ్ భూముల్లో మట్టిని అమ్ముకున్నవారే.. ఇప్పుడు ఆ భూములను కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని దుండిగల్ గ్రామ నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ భూములు అసైనీలకు దక్కాలి.. లేదంటే ప్రభుత్వానికి ఉండాలి కాని మధ్యలో కబ్జాదారుల పాలవ్వకుండా చూడాలని కోరారు.

**జీహెచ్ఎంసీలో 62 ఫిర్యాదులు..**

జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్ ఆఫీసుల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు వచ్చాయి. హెడ్ ఆఫీసులో 35, శంషాబాద్ జోన్ 12, రాజేంద్రనగర్ జోన్ 2, చార్మినార్ జోన్ 1, గోల్కొండ జోన్ 2, ఖైరతాబాద్ జోన్ 1, సికింద్రాబాద్ జోన్ 9 ఫిర్యాదులు వచ్చాయి. అయితే మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కమిషనర కర్ణన్ కు వినతి పత్రం అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ కర్ణన్ ఆదేశించారు.

**సీఎంసీలో 43ఫిర్యాదులు..**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ) పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ 24, ఇంజనీరింగ్ ఏడు, ఫైనాన్స్ & అకౌంట్స్ నాలుగు, అర్బన్ బయోడైవర్సిటీ మూడు, రెవెన్యూ రెండు, చెరువులు, పారిశుధ్యం, వెటర్నరీ విభాగాలకు సంబంధించిన ఒక్కో ఫిర్యాదులు వచ్చాయి. బాధ్యతాయుతమైన పాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు. పౌరులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, తక్షణ పరిష్కారం పొందేందుకు ఈ వేదిక ఎంతో దోహదపడుతుందన్నారు.

**ఎంఎంసీలో 27 ఫిర్యాదులు..**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మొత్తం 27 వినతి పత్రాలు అందగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ పరిష్కారం కోసం కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని, వాటి పరిష్కారం వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని కమిషనర్ తెలిపారు.

### బ్లూసీ వెనుక ఉన్న 2 ఎకరాలను కాపాడండి..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బ్లూసీ హోటల్ వెనుక ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. ప్రభుత్వ భూమిని కొట్టేయాలని అక్కడివారు కేసులు ఒకరిపై ఒకరు వేసుకుని నడిపిస్తున్నారని.. ఈ విషయంలో హైడ్రా చొరవ తీసుకుని కాపాడాలన్నారు. కిక్కిరిసిన జనాభా ఉన్న ఈ ప్రాంతంలో పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి విలేజ్ సర్వే నంబరు 54లో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని.., రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 100, 101లో ఎకరా ప్రభుత్వ భూమి ఉంటే స్థానికంగా ఉన్న వారు కబ్జా చేస్తున్నారని శ్రీ శక్తి మహిళామండలి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సికింద్రబాద్ బేగంపేటలోని బ్రాహ్మణవాడి సర్వే నంబరు 210లో 3 వేల గజాల స్థలం ప్రభుత్వానిది కాగా.. కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సైదాబాద్ లోని ఫిష్ మార్కటట్ వద్ద ఓపెన్ ప్లేస్ 4083 గజాలుంటే.. దానిని పిల్లలకోసం పార్కును అభివృద్ధి చేయాలని మేమంతా జీహెచ్ఎంసీని కోరుతుంటే.. మధ్యలో వేరే వ్యక్తులు వచ్చి కబ్జాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమదంటే తమదని ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ భూమిపై కోర్టుకెక్కడం.. వాళ్లలో ఎవరో ఒకరు సొంతం చేసుకుంటున్నారని.. రెవెన్యూ, జీహెచ్ఎంసీకి కూడా ఫిర్యాదు చేశామని ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి.. పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.



# పంచాయతీ నిధులకు కొత్త రూల్స్!..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు అందే 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రభుత్వం కొత్త గైడ్ లైన్స్ విడుదల చేసింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి విడుదలైన నిధులను ఏయే పనులకు ఖర్చు చేయాలన్న అంశంపై పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆర్థిక సంఘం నిధుల్లో 'టైడ్ గ్రాంట్స్' కింద వచ్చే మొత్తాన్ని రెండు విభాగాలకే కేటాయించాలని సర్కార్ స్పష్టం చేసింది. 50 శాతం నిధులు గ్రామంలో పారిశుధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, మురుగునీటి నిర్వహణ, బహిరంగ మల విసర్జన రహితం గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మాత్రమే వాడాలి. మిగతా 50 శాతం నిధులు తాగునీటి సరఫరా, వర్షపు నీటి సంరక్షణ, నీటి రీసైక్లింగ్ పనులకు కేటాయించాలి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పైపులైన్ల పొడిగింపు పనులకు కూడా ఈ నిధులను వినియోగించుకోవచ్చు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం 'అన్–టైడ్' నిధులను వినియోగించాలని సూచించారు. సొంత భవనం లేని చోట పంచాయతీ భవనాల నిర్మించాలి. ప్రభుత్వ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలి. హెల్త్ సబ్–సెంటర్లలో రోగుల కోసం టాయిలెట్లు, కూరగాయలు, నాన్–వెజ్ అమ్మకాల కోసం ప్రత్యేకంగా విలేజ్ మార్కెట్లు నిర్మించాలి. ఈ మార్కెట్ల వద్ద క్లీనింగ్ కోసం నీటి సౌకర్యం తప్పనిసరిగా ఉండాలి. పనులు చేయకుండానే తప్పుడు వివరాలతో లేదా నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేస్తే సంబంధిత అధికారులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రతి పైసా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారమే ఖర్చు చేయాలి. పనుల వివరాలను గ్రామ సభల్లో తెలుపాలని, కలెక్టర్లు ఈ నిధుల వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశాల్లో పేర్కొంది.

# కబ్జా కోరల్లో పాలమూరు చెరువులు

**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :**

మహబూబ్‌నగర్ జిల్లాలో చెరువుల కబ్జా పర్వం పరాకాష్టకు చేరింది. రక్షించాల్సిన పాలకులే భక్షకులుగా మారుతున్నారా ? అన్న సందేహం కలిగేలా జిల్లాలో జలవనరులు అదృశ్యమవుతున్నాయి. సాక్షాత్తు ప్రభుత్వ రికార్డుల నుంచే చెరువులను మాయం చేస్తూ భూబకాసురులకు ఎర్రతివాసి వేస్తున్న అధికారుల తీరుపై పర్యావరణ ప్రేమికులు, సామాజిక సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**రికార్డుల నుంచే కామాయకుంట అదృశ్యం !**

అప్పనపల్లి విలీన గ్రామంలోని సర్వే నంబర్లు 109 నుంచి 112 వరకు విస్తరించి ఉన్న సుమారు 18 ఎకరాల కామాయకుంట రికార్డుల నుంచే కనుమరుగవ్వడం జిల్లా యంత్రాంగం వైఫల్యానికి పరాకాష్ట. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ కుంటను అటు చెరువుగా గానీ, ఇటు భూమిగా గానీ నమోదు చేయకుండా గాలిలో కలిపేశారు. గతంలో ఫిషరీస్ సొసైటీ రిజిస్ట్రేషన్ కోసం సర్టిఫికేట్లు జారీ చేసిన చరిత్ర ఉన్నప్పటికీ, ఇప్పుడు ఆర్టీఐ కింద వివరాలు అడిగితే సమాధానం చెప్పకపోవడం వెనుక పెద్ద స్థాయి కుట్ర దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై పక్కా ప్రణాళికతోనే ఈ కుంటను రికార్డుల నుంచి తొలగించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కళ్లముందే మల్లమ్మ కుంట కబ్జా!**

బోయపల్లిలో ఉన్న 14.36 ఎకరాల మల్లమ్మ కుంట కబ్జాకు గురవుతున్నట్లు సాక్షాత్తూ ఇరిగేషన్ అధికారులే ధృవీకరిస్తున్నా, చర్యలు మాత్రం శూన్యం. కుంట బఫర్ జోన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ షెడ్లు, రైస్ మిల్లు కాంపౌండ్ వాల్స్ యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. అధికారులు మాత్రం చర్యలు తీసుకుంటామనే ప్రకటనలకే పరిమితమవుతున్నారు.

**మోదుగుంట, పెద్దచెరువుల కుదింపు !**

ఏనుగొండ సమీపంలోని మోదుగుంట ఒకప్పుడు 20 ఎకరాలు ఉండేది, నేడు అది కేవలం 5 ఎకరాలకు పరిమితమైంది. చెరువు మధ్యలో రోడ్లు వేసి వెంచర్లకు దారులు తీస్తున్నా యంత్రాంగం కళ్ళు మూసుకుపోయింది. అటు నగర నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. దాదాపు 40 ఎకరాలు ఆక్రమణలకు గురైందని అధికారులే లెక్కలు చెబుతున్నా, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడం తప్ప వాటిని తొలగించే ధైర్యం చేయడం లేదు. పర్యాటక అభివృద్ధి పేరుతో చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి, బఫర్ జోన్లలో అక్రమ కట్టడాలను సక్రమం చేసే ప్రక్రియ సాగుతోందని విమర్శలు వస్తున్నాయి.

**ప్రజా పాలనలో చెరువులు మాయం ?**

ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే చెరువులు ఆక్రమణలకు గురవ్వడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే జిల్లా వ్యాప్తంగా ఉన్న 240కి పైగా చెరువులపై సమగ్ర సర్వే జరపాలని, రికార్డుల నుంచి మాయమైన కామాయకుంటను తిరిగి చేర్చాలని, ఎఫ్టీఎల్ పరిధిలోని కబ్జాలను కనికరించకుండా కూల్చివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పాలమూరు జిల్లా భవిష్యత్తులో తీవ్ర జల సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మున్సిపల్ శాఖలో పొలిటికల్ ప్రెజర్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 'మేం పైసలిచ్చి వచ్చినం..నాలుగు రాళ్లు వెనుకేసుకోవాలి. మాకు తెలియకుండా ఒక్క ఫైల్ కూడా పోవద్దు. మమ్ములను కూడా చూసుకోవాలి' అంటూ పలువురు మేయర్లు, చైర్మన్లు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. సీఎం పరిధిలోని మున్సిపల్ శాఖలో ఇటువంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

**రాష్ట్రంలో 133 యూఎల్బీలు..**

రాష్ట్రంలో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలను మినహాయిస్తే 130 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. వీటిలో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అన్నింటిలో కొత్త పాలకవర్గాలు సైతం కొలువుదీరాయి. ఇక గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, అచ్చంపేట, సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరేకల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగాల్సి ఉన్నది.

**ఒక్క ఫైల్ పోవద్దు..**

మున్సిపల్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్స్‌లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, 116 మున్సిపాలిటీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు బాధ్యతలు చేపట్టారు. వీరంతా ఎన్నికల్లో పెట్టిన ఖర్చులను రాబట్టుకునే పనిలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ముఖ్యంగా ఆయా మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపాలిటీ పరిధిలో కొత్త లేఅవుట్ పర్మిషన్లు, బడా కంపెనీలకు సంబంధించిన బిల్డింగ్ పర్మిషన్లకు సంబంధించిన ఫైళ్లన్నీ తమ వద్దకు రావాల్సిందేనని పలువురు మేయర్లు, చైర్మన్లు ఆదేశాలు జారీచేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో పాటు ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన బిల్లులు సైతం తమకు తెలియకుండా చెల్లించకూడదనే ఆదేశాలు సైతం ఉన్నట్టు సమాచారం. కార్పొరేషన్/మున్సిపాలిటీలో ఎలాంటి కార్యక్రమమైనా తమకు తెలియకుండా చేయకూడదని అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

**ఆందోళనలో కమిషనర్లు..**

పాలకమండళ్లు ఏర్పడకముందు ఏకచత్రాధిపత్యంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్లు.. ప్రస్తుతం ఆందోళనలో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు అదనంగా మేయర్లు, చైర్మన్లు సైతం తోడవడంతో ఒత్తిడి పెరిగిందని పలువురు మున్సిపల్ కమిషనర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు పోస్టుల కోసం జోరుగా పైరవీలు చేసుకున్న మున్సిపల్ కమిషనర్లు.. ప్రస్తుతం 'ఇక్కడ పనిచేయడం కంటే సెలవుపై వెళ్లిపోవడమే బెటర్' అనే ఆలోచనలో ఉన్నట్టు పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సెలవులపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

# మేము ఎప్పుడూ చెప్పలేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఒకేసారి బంగారు తెలంగాణ చేస్తామని మేము ఎప్పుడూ చెప్పలేదని పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి ఒకేసారి బంగారం చేయాలంటే సాధ్యమేనా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి తినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇవాళ నల్గొండ జిల్లాలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రూ. 10,160 కోట్లు, సన్నబియ్యం పథకానికి రూ. 5 వేల కోట్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కు రూ.6 వేల కోట్లకు పైగా చెల్లించిందన్నారు.

**రూ.11 వేల కోట్ల స్కామ్:**

ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల స్కామ్ జరిగిందని, కాంగ్రెస్ వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించామన్నారు. ఈ అంశంలో నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని డైరెక్టర్లు, ఎండీని అరెస్టు చేస్తే ఇటీవలే బెయిల్ వచ్చిందన్నారు. నల్గొండ జిల్లాలోనే రూ. 4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని బకాయిలు చెల్లించి రెగ్యులర్ గా నడుపుకోవాలని చెప్పామన్నారు. చర్చల తర్వాత బకాయిలు చెల్లించే విధంగా ఒప్పుకున్నారని చెప్పారు. జిల్లాలో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు రచించామని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా కృష్ణాజలాలు తెప్పిస్తామన్నారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు పెంచాలని అధికారులను ఆదేశించారు. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపడంతో పాటు ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలన్నారు. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లా పరిధిలో 2.30 లక్షల టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు.

# బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు.అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్దలు కొడతానన్నారు.దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు.దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

# చంద్రబాబుకు పొన్నం బహిరంగ లేఖ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర విభజనపై వివాదాస్పద మాటలు, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కూటమి నేతలకు అడ్డుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. తెలంగాణ ఏర్పాటుపై అనవసర ద్వేషాలు రగల్చడం ఎవరికీ మంచిది కాదని ఇది మీకు తెలియంది కాదన్నారు. ఏపీలో మీ భాగస్వామ్య పక్షాలైన బీజేపీ నాయకులొకవైపు, జనసేన అధినేతతో పాటు మరోవైపు టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సముచితంగా లేవని రాష్ట్ర విభజన ఏదో అనుచితంగా జరిగినట్టు, అసమంజసంగా తెలంగాణ ఏర్పడినట్టు చేస్తున్న అసందర్భపు వ్యాఖ్యలు తెలుగువారి మధ్య అనవసరమైన స్పర్థలు, వైషమ్యాలు, ద్వేషాలు రగిలించేవిగా ఉంటున్నాయన్నారు. ఇది ఎవరికీ మంచిది కాదని ఏపీలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న కూటమి పెద్దగా మీరు చొరవ తీసుకొని మీ భాగస్వామ్య పక్షాలైన పార్టీ నేతల వ్యాఖ్యల విషయంలో జోక్యం చేసుకోవాలన్నారు. ఈ మేరకు ఇవాళ చంద్రబాబుకు పొన్నం బహిరంగ లేఖ రాశారు.



**రాష్ట్ర విభజన చట్టబద్ధం:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మీరు సుదీర్ఘకాలం రాష్ట్రాన్ని పాలించారని తెలంగాణ ప్రజల ఆర్తి, ఆకాంక్ష మీకు తెలియంది కాదన్నారు. 2000 తొలి దశకమంతా జరిగిన పోరాటాలకు ఉద్యమాలకు మీరు ప్రత్యక్ష సాక్షి అన్నారు. రాష్ట్ర విభజనలో ప్రతి చర్య చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం అని లోకసభ, రాజ్యసభ బిల్లు ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఇలా అన్ని పక్షాల ఆమోదంతో జరిగిన రాష్ట్ర విభజన అనంతరం ఎవరి పంథాలో వారు అభివృద్ధి మార్గంలో సాగుతున్నాయి. ఇటువంటి సయమంలో రాష్ట్ర విభజనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజనను బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్ ప్రత్యేక భేటీ వేదికగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం చిమ్మే విధంగా ఉన్నాయని, ఆంధ్ర ప్రగతికి తెలంగాణ దిష్టి తగిలిందంటూ మీ మరో భాగస్వామి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ మనోభావాల్ని కలతకు గురిచేశాయన్నారు. ఇవి తెలుగు వారి మధ్య వైషమ్యాలు పుట్టించేవే! అలా మాట్లాడటం తప్పని మీ మంత్రివర్గ సహచరునికి చెప్పాలన్నారు.

**మోడీనే కారణం:**

వీటన్నింటికి మూలం ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అనుచిత వ్యాఖ్యలే కారణం అనుకుంటున్నానని 'రాష్ట్ర విభజన ద్వారా తల్లి–బిడ్డను విడగొట్టార'ని ఒకమారు, 'బిడ్డను సంరక్షించడానికి తల్లిని చంపార'ని మరొక సందర్భంలో ఆయన అనుచితంగా మాట్లాడారన్నారు. 'ఒక ఓటు రెండు రాష్ట్రాల'ని 1997లోనే తీర్మానం చేసిన పార్టీ బీజేపీ అని బహుశా ప్రధాని మోడీకి తెలియదేమో! మీరు రాజకీయాల్లో ఆయనకన్న సీనియర్ కనుక కూటమి భాగస్వామిగా ప్రధాని నరేంద్ర మోడీకి ఈ విషయం చెప్పాలన్నారు. మరే పార్లమెంటు సభ్యుడూ రాష్ట్ర విభజనపై అనుచిత, అసందర్భ, అన్యాయపు మాటలు మాట్లాడకుండా కట్టడి చేయడంతో పాటు తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై మాట్లాడిన మాటలు లోక్ సభ రికార్డులనుండి తొలగించేలా లోక్‌సభ స్పీకర్‌కు మీరు లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాలుగా ఉన్నా తెలుగువారందరం ఐక్యంగా, సామరస్యంతో, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగటం నేటి తక్షణ అవసరం అని ఇందుకు మీ సంపూర్ణ సహకారం కావాలన్నారు.

# తెలంగాణ సీఎం మహిళలకు అన్యాయం చేసిండు..


**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** 'కాళేశ్వరం' ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని, అది గోదావరిలో కొట్టుకుపోయినట్లేనని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. ఇప్పుడు మళ్లీ 'యూ–టర్న్' తీసుకున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఇవాళ కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరంలో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని అప్పట్లో చెప్పి, ఇప్పుడు సీబీఐకి కేవలం రూ. 9 వేల కోట్ల స్కామ్ జరిగిందని అర్థం లేని లేఖ రాశారని కామెంట్ చేశారు. అసలు ఏ ఆధారాలను బట్టి సీబీఐ విచారణ చేపట్టాలో ఆయనే స్పష్టత ఇవ్వాలన్నారు. ఎత్తిపోతలకు వాడిన ఒక్కో మోటారు విలువ రూ. 300 కోట్లు అయితే.. రూ. 1,600 కోట్లు ఖర్చు చేసి వేరే దేశాల నుంచి పట్టుకొచ్చారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం అవినీతి మొత్తం బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు వివిధ కేసుల్లో కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరిపై అయినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని బండి సంజయ్ ప్రశ్నించారు.

**ఆ ఇద్దరికి పదవులొస్తే సరిపోతుందా?**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని రాష్ట్రంలోని అతివలకు సీఎం రేవంత్ రెడ్డిని తీరని అన్యాం చేశారని బండి సంజయ్ అన్నారు. మహిళా బిల్లును 'ఇండి' కూటమి అడ్డుకుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలకు పదవులు ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. విపక్ష కుటుంబాల్లోని మహిళలు అభివృద్ధి చెందితే సరిపోతుందా అని సెటైర్లు వేశారు. సీఎం, మాజీ సీఎంల భాష చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌తో పాటు కాంగ్రెస్‌కు కూడా ఏటీఎంలా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతో గతంలో బీఆర్ఎస్ కలిసి పోటీ చేసిందని, పొత్తు ఉంటే వారితో పెట్టుకుంటారు కానీ.. బీజేపీతో ఎందుకు పెట్టుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.



# దరువు తెలంగాణ సాంస్కృతిక సంబరాలు



**ఎల్బీనగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** 20 ఏప్రిల్, 2026, ఆర్ బి, హైద్రాబాద్: ఈ రోజు రవీంద్ర భారతి లో "వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం" అంటూ... విద్యార్థుల అమరత్వాన్ని గొంతెత్తి పాడి, హైదరాబాద్ ను దద్దరిలేలా చేసింది దరువు. తెలంగాణ అమరుల త్యాగాలను రాగాలు గా జేసి తెలంగాణ అంతటా ఉద్యమ వేడిని రగిల్చింది. జైలు గోడల మధ్యన బంధిస్తే "చంచల్ గూడ జైలులోనే చంద్రవంకలారా" అంటూ జైలు గోడల్లో సైతం జంగు సైరను ఊదింది మన దరువు,ప్రపంచ ఉద్యమాల చరిత్రలో తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జరిగిన ఉద్యమం ఒక ప్రత్యేకమైనది. భిన్నమైనది. నేడు ఈ తెలంగాణ రాష్ట్రం అనే గడ్డ మీద సూర్యుడు ఉదయిస్తున్నాడు. అంటే దాని వెనుక త్యాగాల, గాయాల చరిత్ర ఎంతో ఉన్నది. 1200 మంది పైగా స్వయం బలిదానల చరిత్ర ఈగడ్డ మీదనే కన్పిస్తది. లాఠీలకు, తూటాలకు బెదరకుండా లడాయి జేసిన పోరుగడ్డ మన తెలంగాణ. తెలంగాణ ఉద్యమానికి 'గుండెకాయ ఉస్మానియా యూనివర్సిటీ. అట్లాంటి ఉస్మానియాలో విద్యార్థుల ఉద్యమానికి సాంస్కృతిక చైతన్యం కల్పించింది 'దరువు' తెలంగాణ ఉద్యమ చైతన్య వేదిక అనడంలో సందేహం లేదు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించింది. యావత్ తెలంగాణ సమాజాన్ని ఉద్యమంలో ఉంచే పాటగా నిలబడ్డది. స్వార్థ రాజకీయాల పై నిప్పులు చెరిగింది, దరువు.

**దరువు ముచ్చట:**

డిసెంబర్ 20వ 1999వ సంవత్సరంలో సిద్దిపేట డిగ్రీ కళాశాలలో 'దరువు కళాబృందం' గా పురుడు బోసుకున్నది. సామాజిక వివక్ష, ప్రాంతీయ వివక్ష లేని సమ సమాజ నిర్మాణంకై దరువు నడుం కట్టింది. సంస్థ ఏర్పడ్డ మొదటి సం.లోనే 'దళిత రత్నాలు' అనే ఆడియోక్యాసెట్ ను సామాజిక విప్లవకారులైన డా. బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణగురు, ఛత్రపతి సాహు మహారాజ్ లాంటి మహనీయుల పైన పాటలు రూపొందించింది. ఈ పాటలు ఆ రోజుల్లో గ్రామ గ్రామాన విస్తరించినయ్. ప్రతివేదిక మీద 'దళిత రత్నాల' పాటలే విన్పించినయ్ అనేది చారిత్రక సత్యం. అట్లా.. మొదలైన దరువు సదస్సులు, సెమినార్లు, చర్చ గోష్టులు, నాటికలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలు ఎన్నో జరుపుకుంటూ వచ్చింది. దళిత రత్నాలు' క్యాసెట్ తరువాత కొట్లాట, గజ్జెల మోత, 'వరదకన్నీటి పాట', దరువు తెలంగాణ విద్యార్థి పోరాట పాటలు, మరియు ఉస్మానియా ఉద్యమం అనే ఆడియో వీడియో, మరియు మాతొవ్వ, వీరులారా వందనం, ఓయుద్ధం అనే పుస్తకాలను దరువు సంస్థ ఆద్వర్యంలో తీసుకొచ్చినమ్ అని గర్వంగా చెప్పగలం, సిద్ధిపేటలో పలు వార్షికోత్సవ సభలు నిర్వహించుకున్నం. తెలంగాణ దరువు జాతరలు, ఆట-పాట- మాటలతో అనేక కార్యక్రమాలు మరియు దరువు దశాబ్ది ఉత్సవాలను ఉస్మానియా క్యాంపస్ వేదికగా నిర్వహించినమ్. ఉద్యమాలతోనే తెలంగాణ సాధ్యం అని ఉస్మానియా క్యాంపస్ ను యుద్ధ భూమిగా మార్చినం.ఇట్లా ఎంతో గొప్ప ఉద్యమ నేపథ్యం ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. దరువుకు 25 ఏండ్లు నిండిన సందర్భంగా 25 ఏండ్ల దరువు పండుగను దరువు జాతర పేరిట రవీంద్రభారతిలో 20.04.2026 రోజన ఘనంగా నిర్వహించారు. మల్లొక్క సారి తెలంగాణ ఉద్యమ త్యాగాలను నెమరువేసుకుంటూ సాంస్కృతిక సమరోత్సాహంతో సంబురాలు జరిగాయి. ముఖ్య అతిథి గా సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణా రావు హాజరయ్యారు.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి**

ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ మలిదశ విద్యార్థి అమరుల స్మారక స్థూపాన్ని నిర్మాణం చేయాలి.విద్యార్థి అనురుడు "సిరిపురం యాదయ్య" బలిదానం చేసుకున్న ఫిబ్రవరి 21 తేదీని తెలంగాణ కోసం బలిదానంచేసుకున్న 1200 మంది విద్యార్థి అమరుల త్యాగాలను స్మరించుకునేలా "విద్యార్థి అమరుల స్మారక దినోత్సవం" ను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి.తెలంగాణ తొలిదశ మరియు మలిదశ విద్యార్థి అమరుల చరిత్రలను రికార్డు చేసి అమరుల స్మారక మ్యూజియం ను ఏర్పాటు చేయాలి.గద్దరన్న, అందెశ్రీ, ముచ్చర్ల సత్యనారాయణ, గూడ అంజన్న, కాళోజీ, ప్రొ. జయశంకర్, ప్రొ. కేశవరావు జాదవ్ విగ్రహాలు ట్యాంక్ బండ్ పై ఆవిష్కరించాలి. వారి జీవిత చరిత్రలను పాఠ్యాంశాలలో చేర్చాలి.తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి సామాజిక, ఆర్థిక భద్రతను కల్పించాలి. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన నిరుద్యోగ కవులు, కళాకారులకు నూతనంగా సాంస్కృతిక సారధిలో ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలి. సాంస్కృతిక సారధి ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని దరువు తెలంగాణ సాంస్కృతిక చైతన్య వేదిక దరువు అంజన్న, రాష్ట్ర అధ్యక్షులు, ప్రభుత్వ సలహా మండలి సభ్యులు, టూరిజం అండ్ భాషా సాంస్కృతిక శాఖ మరియు డా. దరువు ఎల్లన్న, వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ సలహా మండలి సభ్యులు టూరిజం అండ్ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ పండుగలో రాజకీయ ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థి జె ఏ సి ఉద్యమ నేతలు, ప్రముఖ కవులు, కళాకారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బర్త్ సర్టిఫికెట్ కోసం లంచం..




**నారాయణపేట,ఫ్లాష్ ఇండియా :**

నారాయణపేట ఆర్డీవో రామచందర్ మంగళవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. బర్త్ సర్టిఫికెట్ కు సంబంధించి ఓ వ్యక్తిని లంచం డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆ వ్యక్తులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మహబూబ్ నగర్ ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ సారథ్యంలో అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకొని ఆర్డీవో 25 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ మేరకు డీసీపీ డీఎస్పీ బాలకృష్ణ సారథ్యంలో విచారణ సాగుతోంది.

# బీసీల పట్ల బీజేపీ మనసు మారాలని కోరుతూ...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మహాత్మ జ్యోతిబాపూలే ద్వి శత జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బీసీల పట్ల బీజేపీ మనసు మారాలని కోరుతూ బీసీ జేఏసీ నేతలు మహాత్మా జ్యోతి బాపూలే కి వినతి పత్రం సమర్పించారు.అనంతరం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి బీసీ బిల్లు పెట్టాలని జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా ఎంతో వెనుకబడి దుర్భర స్థితిలో ఉన్నారని బీసీ ప్రధానిగా నరేంద్ర మోడీ ఉన్న బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు.డి లిమిటేషన్ బిల్లు పట్ల ఉన్న హడావుడిబీసీ బిల్లు పట్ల ఎందుకు లేదో ఎన్డీఏ కూటమి చెప్పాలన్నారు.చట్టసభల్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్,యర్రబెల్లి దుర్గయ్య,ఉరిబండి శ్రీనివాస్ యాదవ్,కుమ్మరికుంట్ల సుధాకర్,సయ్యద్ ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.



# కిలాడీ లేడీలు..

## ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లమంటూ రైడ్

**అల్వాల్,ఫ్లాష్ ఇండియా :** ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లమంటూ చెబుతూ దుకాణాల పై రైడ్లు నిర్వహిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు మహిళా నకిలీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మంగళవారం అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓల్డ్ ఆల్వాల్ ఐజీ ప్రాంతంలోని ఒక స్వీట్ హౌస్‌లోకి వెళ్లిన వారు తామే ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లమని చెప్పి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అనుమానం వచ్చిన స్వీట్ హౌస్ యజమాని స్థానిక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు ఫోన్ చేశారు. అందుబాటులో ఉన్న అధికారి స్వీట్ హౌస్ వద్దకు చేరుకుని వారిని ప్రశ్నించగా, తాము ప్రైవేట్ వ్యక్తులమని, వేరే సంస్థకు చెందినవారమని తప్పించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నకిలీ మహిళా ఆఫీసర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు



**ఎల్బీనగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జచీూరా ఒలింపియాడ్స్ 2025-26లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. ఈ పరీక్షలలో 'ఆ' సిరీస్‌కు చెందిన రీజినల్ ఒలింపియాడ్ ఇన్ మ్యాథమెటిక్స్ (ROM), జూనియర్ ఒలింపియాడ్ ఇన్ సైన్స్ అండ్ ఆస్ట్రానమీ (JOSA), నేషనల్ టాలెంట్ ఎగ్జామ్ (NTEX) వంటి పరీక్షలతో పాటు; 'I' సిరీస్‌కు చెందిన అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్లైన ISMO, ISEO, ISSO, ISCO మరియు ISKO పరీక్షలు కూడా ఉన్నాయి. విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు; ఇందులో 93 మంది విద్యార్థులు 'ఆల్ ఇండియా టాప్ 3' ర్యాంకులను సాధించగా, 321 మంది విద్యార్థులు 'టాప్ 10' స్థానాల్లో నిలిచారు. అంతేకాకుండా, 815 మంది విద్యార్థులు 'టాప్ 25'లో, 1661 మంది 'టాప్ 50'లో మరియు 3407 మంది 'టాప్ 100'లో ర్యాంకులను పొందారు. మొత్తంగా 1,55,829 మంది విద్యార్థులు అర్హత సాధించి, 81% విజయ శాతాన్ని నమోదు చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగిన మూడవ వార్షిక పురస్కార ప్రదానోత్సవంలో ఈ విజేతలను ఘనంగా సన్మానించారు. విద్యా రంగ ప్రముఖులు మరియు విశిష్ట అతిథులు హాజరైన ఈ కార్యక్రమంలో, ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎన్. చందన్‌బాబు (గణితం & గణాంక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్) మరియు శ్రీ రోహిత్ పటేల్ (కస్టమ్స్ శాఖ సీనియర్ పన్ను సహాయకుడు, తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక కమిటీ సభ్యుడు) పాల్గొన్నారు. నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జనరల్ మేనేజర్ శ్రీ కె. గోపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పాఠశాలల పరిశోధన & అభివృద్ధి (R&D) విభాగాధిపతులు, నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ తెలంగాణ రాష్ట్ర విభాగానికి చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు (AGM\T), మీడియా కోఆర్డినేటర్ వి నవీన్,కోఆర్డినేటర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు విద్యా విభాగాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. CNAPS ఒలింపియాడ్స్ బృందం (CNAPS ఒలింపియాడ్స్ పాన్-ఇండియా లీడ్ శ్రీ జి. వెంకట నరేంద్ర కుమార్ నేతృత్వంలో) హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ మూడవ వార్షిక పురస్కార ప్రదానోత్సవంలో, జాతీయ స్థాయి విజేతలను ఘనంగా సన్మానించారు. ఇంతటి అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారికి ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులను, అలాగే వారి విజయంలో కీలక పాత్ర పోషించిన అంకితభావం కలిగిన బోధన మరియు బోధనేతర సిబ్బందిని ఈ సందర్భంగా వారు అభినందించారు.

# న్యాయవాది పాశం మాధవరెడ్డి కి ఘన నివాళి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** స్థానిక కోర్టు సముదాయంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత న్యాయవాది, విద్యావేత్త పాశం మాధవరెడ్డి సంతాప సభ మంగళవారం అత్యంత విచారవదనాల మధ్య నిర్వహించబడింది. ముందుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. పవన్ కుమార్,మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య రాణి,సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ తేజ్ లు పాల్గొని మాధవరెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.అనంతరం బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన సంతాప సభలో మాధవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి న్యాయవాదులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య మాట్లాడుతూ 1962 సెప్టెంబర్ 10న జన్మించిన మాధవరెడ్డి బి.ఎస్సీ,ఎం.ఏ,ఎల్.ఎల్.బి పూర్తి చేసి,ఇంగ్లీష్ లెక్చరర్‌గా,సుధా హైస్కూల్ వ్యవస్థాపకులుగా విద్యారంగంలో విశేష సేవలు అందించారని కొనియాడారు.న్యాయవాద వృత్తిలోనూ ఆయన క్రమశిక్షణతో మెలిగేవారని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్,జూనియర్ మరియు మహిళ న్యాయవాదులు పాల్గొని మాట్లాడారు మంద సైదులు,మేక కుమార్ రెడ్డి,నేతి సత్యనారాయణ, టి.రాములు,ఇసారం కరుణాకర్,డి.రాజశేఖర్ నాయక్,వై.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు మాధవరెడ్డి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.ఆయన మరణం న్యాయవాద లోకానికి మరియు విద్యా రంగానికి తీరని లోటని పేర్కొంటూ,వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# చెక్కుల పంపిణీ పేదలకు ఒక వరం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు వేములపల్లి మరియు మాడ్గులపల్లి మండలాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు 60లక్షల 6వేలచెప్పి అని 960 రూపాయల విలువ గల కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయం అందిస్తోందని, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందజేస్తున్నామని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, మండల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్



**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ముడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ వసతి గృహ పాఠశాల (టీఎంఆర్ఈఐఎస్)ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని తవంలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' లక్ష్యాలను వివరించిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వెల్ఫేర్ విద్యార్థుల కోసం క్విజ్, డిబేట్, చిత్రలేఖనం వంటి పోటీలతో టాలెంట్ ఫెస్ట్ నిర్వహించి సృజనాత్మకతను ప్రోత్సహించాలని సూచించారు.సందర్శనలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన సౌకర్యాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ముడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ప్రస్తుత వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, నియోజకవర్గ ప్రజల మరియు బాటసారుల సౌకర్యార్థం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని 7 ప్రధాన కూడలుల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్సీ శంకర్ నాయక్,నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ IAS,సబ్ కలెక్టర్ అమిత్ నారాయణలు ప్రారంభించి,త్రాగు నీరు పంపిణీ చేసారు.అనంతరం బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజు 3వేల మందికి పంపిణీ చేసే ఉచిత పెరుగన్నం పంపిణీ 9వ రోజు కార్యక్రమంలో పాల్గొని పెరుగన్నం పంపిణీ చేసి ప్రజలు మరియు నాయకులతో కలిసి పెరుగన్నం తిన్నారు.ఈ సందర్భం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ"పెరుగుతున్న ఎండల దృష్ట్యా సామాన్య ప్రజలు,ప్రయాణికులు మరియు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని.వారి దాహం తీర్చేందుకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే బిఎల్ఆర్ పట్టణంలోని ప్రధాన కూడలిల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా పట్టణంలో ప్రతిరోజు 3 వేల మందికి ఉచిత పెరుగన్నం పంపిణీ చేయడం చాలా అభినందనీయం అన్నారు.నేను కూడా పెరుగన్నం తినడం జరిగింది, చాలా నాణ్యతగా ఉందని చాలా బాగా చేస్తున్నారు అని ఇలాంటి ఎమ్మెల్యే ఉండటం మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల అదృష్టం అని వారిని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కౌన్సిలర్లు, సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడదెబ్బతో వ్యక్తి మృతి



**మందమర్రి,ఫ్లాష్ ఇండియా :** మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ శాంతినగర్ కు చెందిన బండారి రాజేష్ గౌడ్ అనే వ్యక్తి తో వడదెబ్బతో సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ వంశీకృష్ణ మంగళవారం వేకువ జామున మృతిడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ వంతు సహాయ, సహకారాలు ఉంటాయని ఓదార్చారు. మృతుడు రాజేష్ గౌడ్ స్వయంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ మేనల్లుడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటీ రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు ఓడ్నాల శ్రీనివాస్, బండి సదానందంలు కుటుంబ సభ్యులను ఓదార్చారు.



# సీఎస్‌కేకు 'డూ ఆర్ డై'..

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన సీఎస్‌కే.. కేవలం రెండు విజయాలు మాత్రమే అందుకుంది. ప్రస్తుతం 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ఇప్పటికే లీగ్ దశలో దాదాపుగా సగం మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే.. ఇకపై ప్రతి మ్యాచ్ సీఎస్‌కేకు అత్యంత కీలకం. ఒక్కో మ్యాచ్ ఓడిపోతే.. ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లుతుంటాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 23న వాంఖడేలో ముంబై ఇండియన్స్ (ఎంఐ)పై గెలవడం తప్పనిసరి. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా సీఎస్‌కే లాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి 4 పాయింట్లతో తిరిగి పోటీలోకి వచ్చింది. ముంబై జట్టుకు మంచి కాంబినేషన్ ఉండటంతో.. బలంగా తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముంబైకి కూడా సీఎస్‌కేతో జరగనున్న మ్యాచ్ కీలకం కానుంది. సీఎస్‌కే, ఎంఐ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ అవకాశాలు సన్నగిలుతాయి. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 11 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులో ముందంజలో ఉంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లు 8 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో సీఎస్‌కే ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే.. ఇకపై తప్పనిసరిగా వరుస విజయాలు సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబైపై జరిగే మ్యాచ్‌లో గెలిస్తే సీఎస్‌కే 6 పాయింట్లకు చేరుకుని ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. అదే సమయంలో ముంబైని 4 పాయింట్ల వద్దే ఉంటుంది. ఓడిపోతే సీఎస్‌కే ప్లే ఆఫ్స్ ఆశలు ప్రమాదంలో ఉంటాయి. ఈ కీలక సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎలా జట్టును నడిపిస్తాడో చూడాలి. మొత్తానికి సీఎస్‌కేకు ఇది డూ ఆర్ డై పరిస్థితి అనే చెప్పాలి.

# తిలక్ బ్యాటింగ్ సాగిందిలా!



ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ యువ బ్యాటర్, తెలుగు కుర్రాడు తిలక్ వర్మ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 45 బంతుల్లోనే 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వరుస వికెట్స్ కోల్పోయి కష్టాల్లో ఉన్న ముంబైని తిలక్ ఒంటిచేత్తో ఆదుకున్నాడు. ముందుగా హాఫ్ సెంచరీ, ఆపై సెంచరీ చేసి.. ముంబై భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఇది నిలిచింది. ముఖ్యంగా తిలక్ బ్యాటింగ్‌లో మార్పు, ఓర్పు ప్రత్యేకంగా నిలిచింది. నెమ్మదిగా మొదలైన ఇన్నింగ్స్.. తుఫానుగా మారింది. మొదటి 19 బంతుల్లో తిలక్ వర్మ చాలా జాగ్రత్తగా ఆడాడు. ఒక్క బౌండరీ కూడా లేకుండా సింగిల్స్, డబుల్స్‌తో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. 19 బంతుల్లో 19 పరుగులే చేశాడు. ఈ సమయంలో క్రీజ్‌లో నిలబడటం, పిచ్ పరిస్థితిని అర్థం చేసుకోవడం అతని ప్రధాన లక్ష్యంగా కనిపించింది. ఒత్తిడిలో ఉన్న జట్టుకు స్థిరత్వం ఇవ్వాలనే ఉద్దేశంతో తిలక్ ఆచితూచి ఆడాడు. అయితే ఆ తర్వాత తిలక్ రెచ్చిపోవడంతో.. మ్యాచ్ రూపమే మారిపోయింది. తదుపరి 23 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సులు బాదుతూ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఒక్కసారిగా రన్‌రేట్ పెంచి మ్యాచ్‌ను ముంబై వైపు తిప్పాడు. తిలక్ టైమింగ్, షాట్ సెలక్షన్, పవర్ హిట్టింగ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. తిలక్ వర్మ ఇన్నింగ్స్‌లో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రారంభంలో ఓపికగా ఆడి, సెట్ అయిన తర్వాత ఎదురుదాడి చేయడం. ఇదే గొప్ప బ్యాటర్ల లక్షణం. పరిస్థితులకు అనుగుణంగా తన ఆటను మార్చుకుని జట్టుకు అవసరమైన సమయంలో భారీ స్కోరు అందించాడు. తిలక్ ఆడిన ఈ ఇన్నింగ్స్ నిజంగా అద్భుతం. ఈ ఇన్నింగ్స్‌తో ముంబై ఇండియన్స్‌కు కీలక విజయం దక్కగా.. తిలక్ తనపై ఉన్న నమ్మకాన్ని మరోసారి నిరూపించుకున్నాడు. భవిష్యత్తులో భారత జట్టుకు కూడా అతను కీలక ఆటగాడిగా మారనున్నాడు.

# ముంబై చేతిలో ఘోర ఓటమి..




అహ్మదాబాద్ వేదికగా జరిగిన గుజరాత్ టైటాన్స్ జట్టు ముంబై ఇండియన్స్ చేతిలో భారీ ఓటమి చవి చూసింది. 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన గుజరాత్ టైటాన్స్, కేవలం 15.5 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌట్ అయి 99 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో ఓటమితో పాటు గుజరాత్ టైటాన్స్ తమ ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోర్ ను నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 26 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవడం గమనార్హం. ఇంతకుముందు 2024లో ఢిల్లీ క్యాపిటల్స్ పై ఇదే గ్రౌండ్ లో 89 పరుగులకే ఆలౌట్ అయ్యి వారి కనిష్ట స్కోర్‌ను నమోదు చేసుకొంది. మ్యాచ్ వివరాల్లోకి వెళ్తే.. గుజరాత్ టైటాన్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. ఈ నిర్ణయానికి తగిన విధంగా రబడా ప్రారంభంలోనే కీలక వికెట్లు తీసి ముంబై ఇండియన్స్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. డికాక్, దానిష్ మలేవర్ వికెట్లను త్వరగా పడగొట్టడంతో పాటు సూర్య కుమార్ యాదవ్ ను అద్భుత బంతితో ఔట్ చేశాడు. అయితే ఆ తర్వాత తిలక్ వర్మ అద్భుత ప్రదర్శనతో మ్యాచ్ ను ముంబై ఇండియన్స్ వైపు తిప్పాడు. కేవలం 45 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో అజేయ శతకంతో రెచ్చిపోయాడు. అతడు ఆడిన చివరి 23 బంతుల్లోనే 82 పరుగులు చేయడం విశేషం. అలాగే నామన్ ధీర్ 45 పరుగులతో సహకరించడంతో ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 199/5 భారీ స్కోర్ సాధించింది. లక్ష్య ఛేధనలో గుజరాత్ టైటాన్స్ పూర్తిగా విఫలమైంది. ఓపెనర్ సాయి సుదర్శన్ తొలి బంతికే ఔట్ అవ్వడంతో జస్ప్రీత్ బుమ్రా ఈ ఐపీఎల్ సీజన్ లో తన తొలి వికెట్ నమోదు చేశాడు. అనంతరం అశ్వని కుమార్ కేవలం 24 పరుగులకు 4 వికెట్లు తీసి గుజరాత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. వీరికి తోడుగా ఏఎం ఘజన్‌ఫర్, మిచ్చెల్ స్యాంటర్ చెరో రెండు వికెట్లు సాధించారు. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో తమ స్థాయిని మెరుగుపరుచుకోగా, గుజరాత్ టైటాన్స్ ఆరు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, మూడు ఓటములతో ఆరో స్థానానికి పడిపోయింది.

# టైమ్‌అవుట్ సమయంలో తల తిరిగింది..

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌పై కీలక విజయాన్ని సాధించిన అనంతరం ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అహ్మదాబాద్ వంటి కఠినమైన వేదికపై గెలవడం ఎప్పుడూ సవాలేనని, కానీ ఈసారి జట్టు సమిష్టిగా మంచి క్రికెట్ ఆడిందని తెలిపాడు. ఈ విజయం ముంబై జట్టుకు ఎంతో అవసరమని, అందుకే మరింత ప్రత్యేకంగా అనిపిస్తోందని పేర్కొన్నాడు. మ్యాచ్‌లో 14వ ఓవర్ టైమ్‌అవుట్ తర్వాత గట్టిగా అరిచానని, ఆ సమయంలో తల తిరిగిందని హార్దిక్ చెప్పుకోచ్చాడు. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో పరాజయాల అనంతరం ముంబై విజయం సాధించింది. 'చాలా ముఖ్యమైన విజయం ఇది. బయటి మైదానాల్లో గెలవడం ఎప్పుడూ సవాలే. ముఖ్యంగా అహ్మదాబాద్‌లో ముంబై ఇండియన్స్‌కు గెలుపు చాలా కష్టం. కానీ ఈరోజు వేము మంచి క్రికెట్ ఆడాం. ఈ విజయం చాలా అవసరం, అందుకే ఇది మరింత ప్రత్యేకంగా అనిపిస్తోంది. టైమ్‌అవుట్ సమయంలో నేను తిలక్ గురించి ఆలోచించాను. అతనిలో ఉన్న ప్రతిభను చూస్తే ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. నేను అతనికి చెప్పింది ఒక్కటే.. ఏం జరిగినా బాల్‌ను గమనించి, బలంగా కొట్టు అని. తిలక్ బ్యాటింగ్ స్ట్రైకింగ్ అద్భుతం. ఇలాంటి ఇన్నింగ్స్ అతనికి కొత్త కాదు. టైమ్‌అవుట్లో కొన్ని సార్లు చాలా గట్టిగా చెప్పాను. దాంతో నాకు తల తిరిగినట్టే అయింది (నవ్వుతూ). ఈ ఇన్నింగ్స్ జట్టుకు, తిలక్‌కు, ముంబై ఇండియన్స్‌కు చాలా అవసరం. కెప్టెన్‌గా కూడా ఇలాంటి ఎనర్జీ చాలా మార్పు తీసుకొస్తుంది' అని హార్దిక్ తెలిపాడు. 'చాలామంది బుమ్రా ఎందుకు మొదటి ఓవర్ వేయడు? అని అడుగుతుంటారు. బుమ్రా ఇప్పటికే చాలా మ్యాచ్‌లు ఆడాడు. అందులో కొన్ని సార్లు మాత్రమే తొలి ఓవర్ వేశాడు. ఇది హార్దిక్ సమస్య కాదు. బుమ్రా ఎంతో ప్రత్యేకమైన బౌలర్. జట్టుకు అవసరమైనప్పుడు ఎక్కడైనా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈరోజు కొత్త బంతితో ప్రభావం చూపాలనుకున్నాం, అందుకే అతడికి బంతిని ఇచ్చాను. యువ ఆటగాళ్లు అద్భుతంగా రాణించారు. జట్టుకు ఈ ఎనర్జీ చాలా అవసరం. డెబ్యూ చేసిన క్రిష్ బాగా బౌలింగ్ చేశాడు. అశ్వని అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. గతంలో కూడా అతడు మ్యాచ్ మోమెంటమ్ మార్చాడు. ఫీల్డింగ్ కూడా బాగుంది. నమన్‌ను ప్రత్యేకంగా అభినందించాల్సిందే. ఈ విజయం మాకు మలుపు అవుతుంది' అని హార్దిక్ చెప్పుకొచ్చాడు.



# బిజినెస్




# టిమ్ కుక్ రాజీనామా..

ప్రపంచ ప్రముఖ టెక్ దిగ్గజం ఆపిల్ సంస్థలో భారీ మార్పు చోటుచేసుకుంది. ప్రస్తుత సీఈఓ టిం కుక్ సెప్టెంబర్ 1 నుంచి పదవి నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించారు. ఆయన స్థానంలో కంపెనీకి చెందిన సీనియర్ అధికారి జాన్ టెర్నస్ బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు దశాబ్దానికి పైగా కంపెనీని విజయవంతంగా నడిపించిన కుక్.. ఇకపై ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా కొనసాగుతారు. 2011లో ఆపిల్ స్థాపకుడు స్టీవ్ జాబ్స్ తర్వాత సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన కుక్, కంపెనీని కొత్త ఎత్తులకు తీసుకెళ్లారు. ఆయన పదవీకాలంలో ఆపిల్ మార్కెట్ విలువ సుమారు 3.6 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. ఆపిల్‌ను నడిపించడం నా జీవితంలో గొప్ప గౌరవం అంటూ కుక్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ఆపిల్ ఐఫోన్‌కే పరిమితం కాకుండా ఎకోసిస్టమ్‌ను విస్తరించింది. ఎయిర్‌పాడ్స్, ఆపిల్ వాచ్ వంటి కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడంతో పాటు సర్వీసుల రంగంలో కూడా భారీగా ఎదిగింది. ప్రపంచంలో మొదటిసారిగా 1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను దాటిన కంపెనీగా నిలిచిన ఆపిల్, అనంతరం 4 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను కూడా అందుకుంది. అయితే కుక్ కాలంలో ఐఫోన్ లాంటి విప్లవాత్మక కొత్త ఉత్పత్తి రాలేదని కొంతమంది విమర్శకులు అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ సంస్థను స్థిరంగా పెంచడం, ఆపరేషన్లను మెరుగుపరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇక కొత్త సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్న

జాన్ టెర్నస్‌కు ఉత్పత్తుల అభివృద్ధిలో విస్తృత అనుభవం ఉంది. ప్రస్తుతం హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఆయన.. ఐఫోన్, మాక్, అలాగే విజన్ ప్రో వంటి అత్యాధునిక పరికరాల అభివృద్ధిని పర్యవేక్షించారు. 25 ఏళ్లుగా ఆపిల్‌లో పనిచేస్తూ కంపెనీ ప్రధాన ఉత్పత్తులన్నింటిలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ నాయకత్వ మార్పు ఆపిల్‌కు కీలక దశలో జరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో గూగుల్, ఓపెన్ ఏఐ వంటి కంపెనీలు వేగంగా ముందుకెళ్తుండగా.. ఆపిల్ కొంత వెనుకబడిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో భవిష్యత్తులో హార్డ్‌వేర్ ఇన్నోవేషన్‌తో పాటు ఏఐ సామర్థ్యాల పెంపుపై ఆపిల్ మరింత దృష్టి పెట్టే అవకాశముంది.

# ధర పెంచిన ఎయిర్‌టెల్




దేశీయ రెండో అతిపెద్ద టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ యూజర్లకు షాక్ ఇచ్చింది. పాపులర్ ప్రీపెయిడ్ ప్లాన్లలో కంపెనీ భారీ మార్పులు చేసింది. ఎవరికీ తెలియకుండా రూ. 799 ప్లాన్‌ను తొలగించడమే కాకుండా, మరో ప్లాన్ రూ. 859 ధరను అమాంతం పెంచేసింది. రూ. 40 పెంచడంతో ఈ ప్లాన్ ఇప్పుడు రూ. 899కి చేరింది. అయితే, ఈ ప్లాన్ ప్రయోజనాల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. 84 రోజుల వ్యాలిడిటీతో రోజుకు 1.5జీబీ హైస్పీడ్ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, 100 ఎస్సెమ్మెస్, ఎయిర్‌టెల్ ఫ్రీ హలోట్యూన్ బెనిఫిట్స్ లభిస్తాయి. అయితే, ఇది వరకు రూ. 859గా ఉన్న ఈ ప్లాన్‌లో రివార్డ్‌మిని సబ్‌స్క్రిప్షన్(అదనపు ఖర్చు లేకుండా నెలకు రూ. 80 క్యాష్‌బ్యాక్) సదుపాయం ఉండేది. ఈ ప్లాన్ వద్దనుకునే యూజర్లకు 84 రోజుల వ్యాలిడిటీతోనే రూ. 1,029 ఉంది. ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2జీబీ డేటా పొందవచ్చు. ధరను పెంచడంతో పాటు రూ. 799 ప్లాన్‌ను తొలగించడానికి సంబంధించి ఎయిర్‌టెల్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం(ఆర్పు) పెంచే ఉద్దేశంతో ఈ మార్పు చేసి ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




అంతర్జాతీయ రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల బంగారం, వెండి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు నమోదు అయ్యాయి. ఇవాళ(మంగళవారం) ఉదయం 7 గంటల సమయానికి 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.15,528 ఉండగా.. 22 క్యారెట్లు రూ.14,234కి చేరుకుంది. అలాగే 18 క్యారెట్ల పసిడి రేటు రూ.11,646 వద్ద కొనసాగుతోంది. ఇక, వెండి ధర గ్రాము రూ.274గా, కిలో రూ.2,74,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,430గా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,42,490గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,280గా.. 22 క్యారెట్ల పసిడి రేటు రూ.1,42,340గా నమోదైంది. చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,55,990గా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,990కి చేరుకుంది. ఇక, తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంచుమించుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,280గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,42,340గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,280గా.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,340గా ఉంది. ఇక, వెండి ధరల విషయానికి వస్తే ఢిల్లీలో కిలో వెండి రూ.2,74,900కి చేరుకుంది. చెన్నైలో కేజీ వెండి రూ.2,79,900గా, ముంబైలో రూ.2,74,900గా ఉంది. ఇక, బెంగళూరులో రూ.2,79,900గా నమోదైంది. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి రూ.2,79,900కి చేరింది.

# శాంతి చర్చలపై ఆశలు..



దేశీయ స్టాక్ మార్కెట్ భారీ లాభాల్లో దూసుకెళ్తోంది. ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు జోష్ వచ్చింది. నిన్న ప్రారంభంలో కొంచెం ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. ఈరోజు మాత్రం భారీ లాభాలతో సూచీలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అన్ని రంగాల సూచీలు గ్రీన్‌లో కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు జరగవచ్చని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల్లో నూతనోత్సాహం వచ్చింది. ప్రస్తుతం సెన్సెక్స్ 324 పాయింట్లు లాభపడి 78, 844 దగ్గర కొనసాగుతుండగా.. నిఫ్టీ 88 పాయింట్లు లాభపడి 24, 453 దగ్గర కొనసాగుతోంది. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు నష్టపోయాయి. ఐటీ మినహా అన్ని రంగాల సూచీలు గ్రీన్‌లో కొనసాగుతున్నాయి.

# నకిలీ రీఫండ్ స్కామ్



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ రీఫండ్ మోసానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని డిసైడ్ అయింది. ఖరీదైన లాప్‌టాప్‌లు, గ్రాఫిక్ కార్డ్స్ కొనుగోలు చేసి, వాటికి నకిలీ రీఫండ్లు పొందుతున్న ఓ ముఠాపై అమెజాన్ కోర్టులో దావా వేసింది. ఈ స్కామ్ కారణంగా కంపెనీ మిలియన్ల డాలర్లు నష్టపోయినట్లుగా వెల్లడించింది.

**అసలే ఏం జరిగిందంటే..?**

కొందరు మోసగాళ్లు అమెజాన్‌లో ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఆర్డర్ చేసి, అవి అందిన తర్వాత బాక్స్ ఖాళీగా ఉందని, వస్తువు పాడైపోయిందని చెప్పి నకిలీ క్లెయిమ్స్ ద్వారా డబ్బులు వెనక్కి తీసుకున్నారు. ఈ తరహా రీఫండ్ స్కామ్‌ల వల్ల అమెజాన్ సుమారు మిలియన్ల డాలర్లను నష్టపోయింది. ఈ మోసాన్ని కనిపెట్టడానికి, దర్యాప్తు చేయడానికి

అమెజాన్ ఇప్పటికే 75,000 డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.62 లక్షలు కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ మేరకు దర్యాప్తు కోసం తాము వెచ్చించిన

ఈ మొత్తాన్ని తమకు తిరిగి చెల్లించాలని అమెజాన్ కోర్టును కోరింది.

ఇలాంటి మోసపూరిత క్లెయిమ్‌లను అరికట్టేందుకు సెక్యూరిటీ అల్గారిథమ్స్‌ను మరింత పటిష్టం చేస్తున్నట్లుగా అమెజాన్ ప్రతినిధులు తెలిపారు.




## లక్కీ చాన్స్ కొట్టేసిన స్టార్ హీరోయిన్!

తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ సినిమా స్క్రిప్ట్‌లో భారీ మార్పులు జరిగాయట. కథ మొత్తం మారిపోవడంతో, డేట్స్ సర్దుబాటు కాక నయనతార ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బాలయ్య సరసన నటించే ఆ కొత్త హీరోయిన్ ఎవరనే దానిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.నయనతార ప్లేస్‌లో ఇప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని కాజల్‌ను సంప్రదించగా, ఆమె కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే బాలయ్య-కాజల్ కాంబినేషన్‌లో వచ్చిన 'భగవంత్ కేసరి' భారీ విజయాన్ని అందుకుంది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులకు బాగా నచ్చడంతో, సెంటిమెంట్ పరంగా కూడా కాజల్ అయితేనే కరెక్ట్ అని చిత్ర యూనిట్ భావిస్తోందట అందుకే ఆమెను ఫైనల్ చేసినట్లు టాక్. త్వ-రలోనే కాజల్ షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోకి తోడు, సక్సెస్‌ఫుల్ హీరోయిన్ కాజల్ కూడా తోడవ్వడంతో నందమూరి అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఒకవైపు దర్శకుడు, మ-రోవైపు హీరోయిన్.. ఇద్దరూ బాలయ్యకు గతంలో హిట్స్ ఇచ్చిన వారే కావడంతో, ఈ సినిమా హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అధికారిక వివరాలు త్వరలోనే వెలువడనున్నాయి.

## ఎన్టీఆర్ - నీల్ రిలీజ్ డేట్ ఫిక్స్..




ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా సినిమా పై అనౌన్స్మెంట్ నుంచే భారీ అంచనాలున్నాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ మొదలై చాలా కాలం అవుతోంది. కానీ ఇంకా సగానికి పైగా షూటింగ్ బ్యాలెన్స్ ఉన్నట్టుగా తెలుస్తోంది. మరి ఇంత స్లోగా నడుస్తున్న ఈ సినిమా.. ఇదే ఏడాదిలో రిలీజ్ అవుతుందా? అంటే, లేదనే మాట వినిపిస్తోంది. మొదట 2026 జూన్‌లో విడుదల అవుతుందని మేకర్స్ ప్రకటించారు. ప్రశాంత్ నీల్ భారీ స్థాయిలో చిత్రీకరించే యాక్షన్ సన్నివేశాలకు తోడు.. క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదట.అందుకే.. డ్రాగన్ డిలే అవుతు వస్తోంది. గతంలో 2026 జూన్ 25న సినిమా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించినా ఫ్యాన్స్ కు షాక్ ఇస్తూ ఇప్పుడు 2027కి వెళ్లిపోయింది. తాజాగా ఈ సినిమా ను 2027జూన్ 11 రిలీజ్ చేస్తున్నారు అఫీషియల్ గా ప్రకటిచారు. అలాగే మే 20న ఎన్టీఆర్ బర్త్ డే సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ ను టిలిజ్ చేస్తున్నారు. అందుకోసం ఇప్పటికే పవర్ ఫుల్ గ్లింప్స్ కట్ చేసి ఉంచారు. ఈ విషయాన్ని కూడా అఫీషియల్ గా ప్రకటించారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ సరికొత్తగా మేకోవర్ అవుతున్నాడు. భారీగా వెయిట్ లాస్ అయి, కండలు తిరిగిన దేహంతో కనిపిస్తున్నాడు. దీంతో.. డ్రాగన్ ఫస్ట్ లుక్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు టైగర్ ఫ్యాన్స్. పక్కా ప్రశాంత్ నీల్ మార్క్ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో.. కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.




## ఓటీటీలోకి శర్వానంద్ 'బైకర్'..!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాళవిక నాయర్ హీరోయిన్‌గా దర్శకుడు అభిలాష్ రెడ్డి రూపొందించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'బైకర్'. ఇటీవల థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఆడియెన్స్ నుంచి అద్భుతమైన రె-స్పాన్స్ అందుకుంది. ముఖ్యంగా సీనియర్ హీరో రాజశేఖర్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మె-రవడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద రూ. 40 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. జిబ్రాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ సినిమాకు పెద్ద ప్లస్ అయ్యాయి. రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషనల్ పాయింట్‌తో సాగే ఈ కథ యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను కూడా బాగా ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సందడి చేయడానికి ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, 'బైకర్' చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. థియేటర్లలో సక్సెస్‌ఫుల్ రన్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను మే 1, 2026 నుంచి స్ట్రీమింగ్ చేయాలని నెట్‌ఫ్లిక్స్ ప్లాన్ చేస్తోంది. వేసవి సెలవుల కానుకగా ఈ చిత్రాన్ని డిజిటల్ ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. త్వరలోనే దీనిపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. థియేటర్లలో మిస్ అయిన వారు మే మొదటి వారం నుంచి ఈ సినిమాను ఇంటి వద్దే కూర్చుని ఎంజాయ్ చేయొచ్చు.

## 'రాకా' మ్యూజిక్..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ మాస్ డైరెక్టర్ అట్లీ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా'. ఇటీవల విడుదలైన ఈ సినిమా టైటిల్ పోస్టర్, థీమ్ ట్రాక్ 'మేక్ వే ఫర్ ది కింగ్' సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'కావటి' ఫేమ్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా మ్యూజిక్, సౌండింగ్ గురించి సాయి అభ్యంకర్ వెల్లడించిన విషయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.సాయి అభ్యంకర్ మాట్లాడుతూ.. ' 'రాకా' కోసం నేను అట్లీని కలిసినప్పుడే ఈ సినిమా సౌండింగ్ ఎలా ఉండాలో ఆయనకు ఒక స్పష్టమైన విజన్ ఉంది.ఈ సినిమా మ్యూజిక్ కేవలం భారతీయ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండాలని మేమంతా ఫిక్స్ అయ్యాము. అట్లీ గారు కోరుకున్నట్లుగా నేను సిద్ధం చేసిన థీమ్ ట్రాక్ ఆయనకు, అల్లు అర్జున్ కి ఎంతో నచ్చింది. ప్రతి ట్రాక్‌లోనూ ఒక కొత్త ఫీల్, గ్లోబల్ సౌండింగ్ ఉండేలా వే-ము శ్రమిస్తున్నాము' అని సాయి పేర్కొన్నారు.సంగీతం పట్ల అల్లు అర్జున్‌కు ఉన్న అవగాహన తనను ఆశ్చర్యపరిచిందని సాయి అభ్యంకర్ చెప్పారు. ఐకాన్ స్టార్ క్రేజ్‌కు,




అట్లీ మాస్ విజువల్స్ కు తగ్గట్టుగా ఒక కొత్త రకమైన సౌండింగ్‌ను ఈ సినిమాతో పరిచయం చేయబోతున్నట్లు ఆయన ధీమా వ్యక్తం చేశారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామాలో దీపికా పదుకొణె హీరోయి-న్‌గా నటిస్తుండగా, హాలీవుడ్ స్థాయి టెక్నీషియన్లు దీనికి పనిచేస్తున్నారు.

## కెజిఎఫ్3 పై ఫ్యాన్స్‌కు క్లారిటీ ఇచ్చిన హీరో!

కన్నడ రాకింగ్ స్టార్ యష్ పేరు వింటేనే బాక్సాఫీస్ రికార్డులు గుర్తుకు వస్తాయి. 'కెజిఎఫ్' మూవీతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఆ తర్వాత 'కెజిఎఫ్ చాప్టర్ 2'తో ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించారు. ప్రస్తుతం యష్ తన తదుపరి చిత్రాలైన టాక్సిక్, 'రామాయణ, రామాయణ-2 వంటి భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో కియారా అద్వాని, రుక్మిణి వసంత్, తారా సుతారియా వంటి స్టార్ హీరోయిన్లు నటిస్తుండటంతో సినిమాపై మరింత క్రేజ్ పెరిగింది. నిజానికి ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చిలో విడుదల కావాల్సి ఉంది. కానీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల జూన్ 4వ తేదీకి వాయిదా పడింది.ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో, యష్ ప్రమోషన్స్ పనుల్లో వేగం పెంచారు. తాజాగా.. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న యష్, అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 'కెజిఎఫ్ చాప్టర్ 3' గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం



నా దృష్టంతా టాక్సిక్, రామాయణ చిత్రాల పైనే ఉంది. అందుకే ఇప్పుడు మరో ప్రాజెక్ట్ గురించి ఆలోచించడం లేదు" అని స్పష్టం చేశారు. అయితే, దర్శకుడు ప్రశాంత్ నీల్, తాను ఎప్పుడూ టచ్‌లోనే ఉంటామని.. కథ గురించి చర్చిస్తూనే ఉంటామని తెలిపారు. సరైన కథ కుదిరిన వెంటనే ఖచ్చితంగా కెజిఎఫ్-3 ఉంటుందని యష్ హామీ ఇవ్వడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కానీ కొంత నిరాశకు గురవుతున్నారు. ఈ మూడు ప్రాజెక్ట్స్ అయిపోయాక చేస్తారు కావచ్చని అభిప్రాయపడుతున్నారు.

## సాయి పల్లవి ఎమోషనల్ క్లారిటీ..!



టాలెంట్, అందం, అభినయం.. ఈ మూడింటి కలయిక సాయి పల్లవి. తెలుగు, తమిళ, భాషల్లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందుతున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన 'రామయణ' చిత్రంలో సీతగా నటిస్తోంది. అయితే కెరీర్ పరంగా ఎంత ఎత్తుకు ఎదిగినా , కొన్ని వివాదాలు మాత్రం ఆమెను వెంటాడుతునే ఉన్నాయి. ముఖ్యంగా తాను మలయాళీని కాదన్న విషయంపై గతంలో జరిగిన రచ్చపై తాజాగా సాయి పల్లవి స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశా-రు.దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో 'మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?' అని ఒక రిపోర్టర్ ప్రశ్నించగా.. 'నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు' అని సాయి పల్లవి బదులిచ్చారు. కానీ, రెండు సంవత్సరాల తర్వాత అదే మాటను కొందరు వక్రీకరించి 'మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది' అంటూ తప్పుడు ప్రచారం చేశారట.. అయితే ఈ హెడ్‌లైన్ చూసి తాను.. 'షాక్‌కు గుర-య్యా, అసలు నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. తమిళనాడులోని కోయంబత్తూరులో పుట్టి పెరిగిన నేను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పా, అంతే తప్ప ఇతర భాషలను తక్కువ చేసే ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు' అని ఆమె స్పష్టం చేశారు. సాయి పల్లవి ఇచ్చిన ఈ వివరణతో గత కొన్నాళ్లుగా సాగుతున్న ఈ చిన్నపాటి వివాదానికి ఇప్పుడు పూర్తి స్థాయిలో తెరపడింది.

## వీధులు గుర్తుపెట్టుకునే పేరు 'కేడి'..

కన్నడ యాక్షన్ స్టార్ ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'కేడి: ది డెవిల్' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజువల్స్, యాక్షన్ పరంగా హాలీవుడ్ రేంజ్‌లో కనిపిస్తున్న ఈ సినిమా, షూటింగ్ మొదలైనప్పటి నుండి ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తూనే ఉంది. ఇటీవల ఈ సినిమా నుండి విడుదలైన ఒక మాస్ సాంగ్ పెద్ద దుమారమే రేపింది. ఇందులో బాలీవుడ్ హాట్ బ్యూటీ నోరా ఫతేహి డ్యాన్స్ చేయగా, సంజయ్ దత్ కూడా కనిపించారు. అయితే, ఈ పాటలో వాడిన కొన్ని పదాలు అసభ్యకరంగా ఉన్నాయంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. నోరా మరియు సంజయ్ దత్ వంటి స్టార్లపై నెటిజన్లు పెదవి విరిచారు. అయినప్పటికీ, చిత్ర బృందం వీటిని తట్టుకుని సినిమాను పూర్తి చేసింది. ఎన్నో అడ్డంకులను దాటుకుని, ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమయ్యారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగానే అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను ఏప్రిల్ 22న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. "ప్రతి యుగంలోనూ, వీధులు ఎప్పటికీ మరువలేని ఒక పేరు ఉంటుంది.. ట్రైలర్ వస్తోంది, అస్సలు మిస్ అవ్వకండి" అంటూ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై హైప్‌ను



పెంచేసింది. ఈ సినిమాలో ధ్రువ సర్జా సరసన నానయ్య హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, రమేష్ అరవింద్, శిల్పా శెట్టి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పాన్ ఇండియా లెవల్‌లో విడుదల కాబోతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




## ధనుష్ నిర్మాణంలో మృణాల్..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఎంతో బిజీగా ఉన్నారు. వరుసగా భారీ ప్రాజెక్టులను లైన్లో పెడుతూ నటుడిగా, దర్శకుడిగా దూసుకుపోతున్నారు. ఇప్పటికే 'కర' చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్న ధనుష్, తాజాగా మరో ఆసక్తికరమైన నిర్మాణ బాధ్యతను చేపట్టారు. తన సొంత బ్యానర్ వండర్ బార్, ప్రైమార్క్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఒక లేడీ ఓరియెంటెడ్ చారిత్రక చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి రమేష్ నందన్ దర్శకత్వం వహించనున్నారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించనున్నారనే వార్త ఇప్పుడు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పటికే మృణాల్ ఈ సినిమా కోసం లుక్ టెస్ట్ కూడా పూర్తి చేసుకున్నారని, చిత్రబృందం ఆమెను అధికారికంగా ఫైనల్ చేసిందని సమాచారం.అయితే ధనుష్, మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉన్నారంటూ గత కొద్ది కాలంగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. వీటిపై వారు ఎన్నిసార్లు స్పందించినా, పుకార్లు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఈ కొత్త సినిమా ప్రకటనతో, మళ్ళీ ఆ వార్తలు తెరపైకి వచ్చాయి. కేవలం తమ మధ్య ఉన్న సాన్నిహిత్యం వల్లే ధనుష్ ఈ సినిమాలో మృణాల్‌ను తీసుకున్నారని, మేకర్స్‌కు కూడా ఆమె పేరును ఆయనే సూచించారని కోలీవుడ్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా, ధనుష్ నిర్మాణంలో మృణాల్ ఠాకూర్ చేస్తున్న ఈ చారిత్రక చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం నిజమా లేక కేవలం వృత్తిపరమైన బంధమేనా అనేది పక్కన పెడితే, వీరి కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకుల్లో మాత్రం ఆసక్తిని పెంచింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడనున్నాయి.

## సైన్స్ ఫిక్షన్ దారిలో ప్రదీప్..

'లవ్ టుడే' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్‌తో స్టార్‌డమ్ అందుకున్న ప్రదీప్ రంగనాథన్, ఆ తర్వాత కూడా డ్రాగన్, డ్యూడ్ వంటి చిత్రాలతో తన జోరును కొనసాగించాడు. అయితే, ఇటీవల ఎన్నో అంచనాల మధ్య విడుదలైన 'లవ్ ఇన్యూరెన్స్ కంపెనీ' సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. దీనివల్ల ప్రదీప్ తదుపరి సినిమాల ఎంపికపై అందరి దృష్టి పడింది. ఈక్రమంలో.. తాజాగా, ప్రదీప్ రంగనాథన్‌కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇంతకుముందు ఆయన చేసిన సినిమాలు హిట్ అయినప్పటికీ ఇటీవల ఓ పరాజయాన్ని చవిచూసిన దర్శకుడు వెంకట్ ప్రభు దర్శకత్వంలో ప్రదీప్ ఒక సైన్స్ ఫిక్షన్ సినిమా చేయబోతున్నాడని టాక్. ఇప్పటికే వెంకట్ ప్రభు చెప్పిన కథకు ప్రదీప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుందని సమాచారం. ప్రదీప్ కెరీర్ మంచి ఫామ్‌లో ఉన్న ఈ తరుణంలో, వరుస ఫ్లాపుల్లో ఉన్న వెంకట్ ప్రభుతో జత కట్టడంపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామూలుగానే ప్రదీప్ తనదైన శైలి కథలతో ప్రేక్షకులను అలరిస్తుంటాడు, ఇప్పుడు ఇలాంటి



సమయంలో ఇలాంటి ప్రయోగం అవసరమా? అని ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా చర్చించుకుంటున్నారు. ఒకవేళ ఈ సినిమా కనుక హిట్ కాకుంటే, ప్రదీప్ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని నెటిజన్లు హెచ్చరిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**